# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 3-10-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-2020 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :27 సంచిక:52 పేజీలు: 4 వెల: రూ.1/-


# కరోనా బారినపడ్డ ట్రంప్ దంపతులు

**హోం క్వారంటైన్‌లో ఉన్నట్లు ట్రంప్ ట్వీట్**
**చికిత్స కూడా తీసుకుంటున్నట్లు వెల్లడి**
**అధ్యక్ష ఎన్నికల ప్రచారానికి ఆటంకం**
**త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించిన ప్రధాని మోడీ**

వాషింగ్టన్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆయన భార్య మిలానియా ట్రంప్‌లు కరోనా బారిన పడ్డారు. వారిద్దరూ కరోనా పరీక్షలో పాజిటివ్‌గా తేలారు. దీంతో హోమ్ క్వారెంటైన్ పక్రియను మొదలు పెట్టనున్నట్లు ట్రంప్ తన ట్విట్టర్‌లో వెల్లడించారు. తక్షణమే రికవరీ పక్రియను కూడా ప్రారంభించ నున్నట్లు ఆయన పేర్కొన్నారు. వైరస్ బారి నుంచి త్వరలోనే విముక్తి చెందుతామని కూడా ట్రంప్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఇదిలావుంటే ట్రంప్ ప్రచార కార్యక్రమం నిలిపోనుందిన తెలుస్తోంది. ట్రంప్ సలహాదారు హోప్ హిక్స్‌కు కరోనా సంక్రమించింది. ఆమె పాజిటివ్‌గా తేలడంతో.. అధ్యక్ష సిబ్బంది మొత్తం అప్రమత్తమైంది. ట్రంప్ దంపతులు కూడా కరోనా పరీక్షలు చేయించుకున్నారు. పరీక్ష ఫలితాలు రాకముందే ట్రంప్ దంపతులు క్వారెంటైన్ పక్రియను మొదలుపెట్టినట్లు తెలుస్తోంది. సలహాదారు హోప్ హిక్స్ ఎటువంటి బ్రేక్ లేకుండా పనిచేస్తున్నట్లు తన ట్వీట్‌లో ట్రంప్ వెల్లడించారు. ఇటీవల డోనాల్డ్ ట్రంప్‌తో కలిసి హిక్స్ అనేకసార్లు ప్రయాణం చేశారు. రెండు రోజుల క్రితం ఓహియాలోని క్లీవ్‌లాండ్‌లో జరిగిన తొలి డిబేట్‌కు కూడా ట్రంప్‌తో కలిసి హిక్స్ వెళ్లారు. మాస్క్ లేకుండానే అధ్యక్ష భవన సిబ్బంది ఆమెతో గడిపినట్లు తెలుస్తోంది. కానీ ట్రంప్ మాత్రం ఆమె మాస్క్‌లు ధరించినట్లు ఓ ఛానల్‌తో చెప్పారు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వైట్‌హౌజ్ రిపోర్టర్లకు ట్రంప్ కరోనా రిపోర్ట్‌ను వెల్లడించారు. అధ్యక్షుడు ట్రంప్ వద్ద ఫిజీషియన్‌గా చేస్తున్న నావీ కమాండర్ డాక్టర్ సీన్ కాన్లే ఈ విషయాన్ని ధ్రువీకరించారు. గురువారం సాయంత్రం తనకు పాజిటివ్ టెస్ట్ ఫలితాలు వచ్చినట్లు డాక్టర్ తెలిపారు. ప్రస్తుతం ఇద్దరూ క్షేమంగా ఉన్నారని, వైట్‌హౌజ్‌లోనే ఉండేందుకు వాళ్లు ఇష్టపడుతున్నారని కాన్లే తెలిపారు. అధ్యక్ష ఎన్నికలకు ముందు ట్రంప్ కరోనా పరీక్షలో పాజిటివ్ తేలడం కొంత ఇబ్బందికరమే. ఎన్నికల తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో ట్రంప్ ఎన్ని రోజుల పాటు క్వారెంటైన్ అవుతారో చెప్పడం కష్టమే. ప్రత్యర్థి జోసెఫ్ బైడెన్‌తో తొలి డిబేట్‌లో ట్రంప్ పాల్గొన్న విషయం తెలిసిందే. ఈనెల 8వ తేదీన రెండవ చర్చ జరగాల్సి ఉన్నది. కానీ ఈలోపే ట్రంప్ పాజిటివ్‌గా తేలారు. అయితే క్వారెంటైన్‌కు వెళ్లనున్న ట్రంప్ ఎన్ని రోజులు స్వీయనిర్బంధంలో ఉంటారో తెలియదు. పాజిటివ్‌గా తేలిన ట్రంప్‌కు ఎటువంటి వ్యాధి లక్షణాలు ఉన్నాయో కూడా ఇంకా నిర్ధారణ కాలేదు. నవంబర్ 3వ తేదీన అధ్యక్ష ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ట్రంప్ ప్రచారానికి బ్రేక్ పడినట్లు భావిస్తున్నారు. దీంతో.. అమెరికా అధ్యక్ష ఎన్నికల ముందు ట్రంప్‌కు భారీ షాక్ తగిలినట్టు అయ్యింది. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఈ ఏడాది నవంబర్‌లోనే జరగనున్నాయి.. ఇందుకోసం ఇప్పటికే డెమెక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య హోరాహోరీ పోరు సాగుతోంది. మొదట్లో చప్పగా మొదలైన ఈ పోరు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఊపందుకుంది. తాజాగా ట్రంప్, బిడెన్‌ల మధ్య జరిగిన అధ్యక్ష అభ్యర్థుల చర్జాగోష్ఠి కూడా వ్యక్తిగత విమర్శల వరకూ వెళ్లింది. దీంతో అమెరికా అధ్యక్ష ఎన్నికల వాతావరణం పతాక స్థాయికి చేరింది. ఇదే సమయంలో ట్రంప్ ఆయన భార్యకు కరోనా సోకవడం.. వారికి పెద్ద సమస్యగా మారింది. మరోసారి ఎన్నికల బరిలోకి దిగిన తమ అధ్యక్షుడికి కరోనా సోకిందన్న విషయం తెలియగానే రిపబ్లికన్లలో కలవరం మొదలైంది.. నవంబర్‌లో ఎన్నికలు అంటే ఇది కీలకమైన సమయం.. జోరుగా ప్రచారం చేయాల్సిన సమయం.. ప్రత్యర్థులను ఇరకాటంలో పెట్టేలా వ్యూహాలు సిద్ధం చేయాల్సిన టైం.. ఈ సమయంలో.. ట్రంప్ కరోనా బారినపడడంతో ఆయన దాదాపు 14 రోజులు ఇంటికే పరిమితం కానున్నారు.. ఆ తర్వాత కూడా పరిస్థితి ఏంటో ఇప్పుడే చెప్పలేని పరిస్థితి.. దీంతో.. ట్రంప్ ఎన్నికల ప్రచారంలో సాధ్యం కాకపోవచ్చు అనే చర్చ సాగుతోంది. కోవిడ్-19 పాజిటివ్ కేసులతో అమెరికా అతలాకుతల మవుతున్న తరుణంలో మాస్కును ధరించాలని, వైద్య సిబ్బంది, అధికారులు హెచ్చరించినా అధ్యక్షుడు బేఖాతరు చేస్తూ వచ్చారు. కానీ ఆ తరువాత వాషింగ్టన్ డీసీలోని మిలిటరీ ఆసుపత్రి సందర్శన సందర్భంగా నలుపు రంగు మాస్క్ ధరించి అందర్నీ విస్మయ పర్చారు. కాగా కరోనాకు అత్యంత ఎక్కువ గా ప్రభావితమైన దేశాల్లో అమరికా మొదటి స్థానంలో ఉంది. ఇప్పటివరకు 7.31 మిలియన్ల మంది వైరస్ బారిన పడగా, మరణించిన వారి సంఖ్య 2 లక్షలు దాటేసింది.

త్వరగా కోలుకోవాలిన మోడీ ఆకాంక్ష

కరోనా బారినపడిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆయన సతీమణి మెలానియా త్వరగా కోలుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ ఆకాంక్షించారు. 'మిత్రుడు ట్రంప్ మునపటిలా పూర్తి ఆరోగ్యవంతుడిగా తిరిగిరావాలి' అని ట్వీట్ చేశారు. ఈ ఉదయం ట్రంప్ దంపతులకు కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ కావడంతో హోం క్వారంటైన్‌కు వెళ్లిన సంగతి తెలిసిందే. తన ప్రధాన సలహాదారు హోప్ హిక్స్ ఇటీవల కరోనా బారినపడగా ట్రంప్ సతీమణితో కలిసి కరోనా నిర్ధారణ పరీక్ష చేయించుకోగా పాజిటివ్ వచ్చింది. దీంతో ఆయన క్వారంటైన్‌లోకి వెళ్లి అక్కడి నుంచే అన్ని బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ట్రంప్ దంపతుల ఆరోగ్యం నిలకడగా ఉందని వైట్‌హౌస్ వైద్యులు తెలిపారు. అధ్యక్ష ఎన్నికలకు ముందు ట్రంప్ కరోనా బారినపడటం ఆయనకు కొంత ఇబ్బందికరమేనని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

## కోవిడ్ నిబంధనల మేరకు సివిల్స్ పరీక్ష

**4న జరిగే పరీక్షకు ప్రత్యేక ఏర్పాట్లు**
**మాస్కులు, శానిటైజర్లు తప్పనిసరి**

హైదరాబాద్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ రాత పరీక్షలను కరోనా నిబంధనలు అనుసరించి నిర్వహించనున్నారు. ఈ మేరకు దేశవ్యాప్తంగా ఒకే విధానంతో ముందుకు సాగనున్నారు. సివిల్స్ నిర్వహణకు కోర్టుల్లో అడ్డంకులు తొలిగి పోయాయి. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ దేశ వ్యాప్తంగా ఆదివారం 4న నిర్వహించే ఈ పరీక్షను సజావుగా నిర్వహించేందుకు జిల్లా అధికారులు చర్యలు తీసుకున్నారు. హైదరాబాద్‌లో జిల్లా కలెక్టర్, పరీక్షల కో ఆర్డినేటింగ్ సూపర్‌వైజర్ శ్వేతామహంతి పరీక్షల నిర్వహణపై అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 99 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా, 46,171 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని తెలిపారు. ఉదయం 9 : 30 నుంచి 11 : 30 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 : 30 నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు రెండు సెషన్లలో పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అభ్యర్థులు తమ వెంట డౌన్‌లోడ్ చేసుకున్న అడ్మిట్‌కార్డుతో పాటు, గుర్తింపుకార్డును వెంట తెచ్చుకోవా లన్నారు. కొవిడ్ నిబంధనల ప్రకారం మాస్కును ధరించాలని, శానిటైజర్, భౌతికదూరం పాటించాలన్నారు. మాస్కులేని అభ్యర్థులను పరీక్షను అనుమతించమని స్పష్టం చేశారు. ఎలక్ట్రానిక్,రికార్డింగ్ పరికరా లను కేంద్రంలోకి అనుమతించమన్నారు. అభ్యర్థులు తమకు కేటాయించిన కేంద్రానికి గంటముందుగానే చేరుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణకు 99 మంది లోకల్ ఇన్‌స్పెక్టింగ్ అధికారులు, 34 మంది రూట్ ఆఫీసర్లను నియమించామన్నారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో పై అధికారులను సంప్రదించాలన్నారు.

గాంధీ జయంతిని పురస్కరించుకుని లంగర్‌హౌజ్ బాపూఘాట్ వద్ద మహాత్ముడికి నివాళి అర్పించిన గవర్నర్ తమిళసై, సిఎం కెసిఆర్ తదితరులు

# మహాత్ముడికి ఘనంగా నివాళి

**బాపూఘాట్‌లో అంజలి ఘటించిన తమిళసై, సిఎం కెసిఆర్**

హైదరాబాద్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): రాష్ట్ర వ్యాప్తంగా మహాత్మా గాంధీ 151వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆయన విగ్రహానికిపూలమాల వేసి నివాళి అర్పించారు. తెలంగాణ ప్రభుత్వం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించింది.

ఉదయం 10 గంటల 45 నిమిషాల సమయంలో లంగర్‌హౌస్‌లోని బాపూఘాట్ వద్ద మహత్ముడి విగ్రహానికి గవర్నర్ తమిళి సై సౌందర్ రాజన్, సీఎం కేసీఆర్ పూలమాల వేసి పుష్పగుచ్చాలు ఉంచి నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన సర్వమత ప్రార్థనల్లో వారు పాల్గొన్నారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్త ఆసుకేందర్ రెడ్డి మంత్రులు తలసాని శ్రీనివాసయాదవ్, మహ్మూద్ అలీ, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్ బొంతు రామ్మోహన్,పలువురు ఉన్నతాధికారులు సైతం బాపూజీకి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాపూఘాట్‌ను సర్వాంగ్ సుందరంగా తీర్చి దిద్దారు. సిఎం కెసిఆర్, గవర్నర్ రాకతో భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ మార్గంలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. పోలీసులు భారీగా బందోబస్తు ఏర్పాటు చేశారు.

సత్యం,అహింస ఆయన మార్గం: ఎర్రబెల్లి

సత్యం, అహింసా మార్గాల్లో దేనినైనా సాధించగలమని నిరూపించిన వ్యక్తిగా మహాత్మా గాంధీ చరిత్రలో ఎప్పటికి నిలిచిపోతారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలని మహాత్ముడు నిరంతరం కోరుకునేవారని చెప్పారు. గాంధీజీ 151వ జయంతి సందర్భంగా జాతిపితకు ఘనంగా నివాళులర్పించారు. గ్రామాల్లో వలసలు తగ్గినప్పుడే గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమవుతుందని చెప్పారు. మహాత్ముని మాటలకు అనుగుణంగా సీఎం కేసీఆర్ గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. రైతులకు నూతన రెవెన్యూ చట్టం, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలతో రైతుల కష్టాలు తీరుస్తున్నారని వెల్లడించారు. అహింసా, సత్యాగ్రహం అనే ఆయుధాలతో సూర్యుడు అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యానికి గాంధీజీ పశ్చిమాన్ని చూపించారని మంత్రి పువ్వాడ అజయ్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఖమ్మంలోని గాంధీ చౌక్‌లో బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహాత్ముడు చూపిన మార్గం అందరికీ అనుసరణీయమని చెప్పారు.

టీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గాంధీజీకి ఘన నివాళులు

గాంధీజీ జయంతి సందర్భంగా టీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో గాంధీజీకి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా టీఆర్ఎస్వీ నేతలు మాట్లాడుతూ.. గాంధీజీ ఆచరించిన సత్యం, అహింసా, సేవ ఆదర్శాలు ఇప్పుడు మరింత ఆచరణీయమన్నారు. సత్యాగ్రహమే ఆయుధంగా అహింసా మార్గంలో పోరాడి కోట్లాది భారతీయులకు స్వేచ్ఛా, స్వాతంత్యాన్ని అందించిన గొప్ప నాయకుడు గాంధీజీ అన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు నెమ్మాది శ్రవణ్ కుమార్, రవికిరణ్, టీఆర్ఎస్ విద్యార్థి విభాగ రాష్ట్ర నాయకులు ఆల్తాఫ్, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## మైక్రో ఆర్టిస్ట్ మధుకు సోనూసూద్ అభినందనలు

**-బొమ్మలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన సోనూ**

రంగారెడ్డి,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): పెన్సిల్‌తో బొమ్మలు గీయడం వేరు. ఆ పెన్సిల్ ముల్లునే అందమైన ఆకృతిగా మలచడం వేరు.

అదో అద్భుతమైన కళ. పెన్సిల్ లిడ్‌పై కళాఖండాలు చెక్కాలంటే ఎంతో ఓర్పు.. నేర్పు ఉండాలి. అలాంటి అద్భుతమైన సూక్ష్మ కళాకృతులను రూపొందించడంలో రంగారెడ్డి జిల్లా తాండూరుకి చెందిన మైక్రో ఆర్టిస్ట్ బిర్కుడ్ మధుసూదన్ ఆరితేరారు.

సామాన్య మధ్యతరగతి కుటుంబానికి చెందిన మధు.. మైక్రో ఆర్టిస్టుగా తన ప్రతిభను చాటుకుంటున్నారు.

తాజాగా సోనూసూద్ ప్రశంసలు అందుకోవడంతో అందరి దృష్టిని ఆకర్షించారు. అగ్గిపుల్లపై సోనూ ముఖాన్ని చెక్కి అందరినీ అబ్బురపరిచారు. అలాగే పెన్సిల్‌పై సోనూ పేరును కూడా చెక్కి..

దాన్ని ఆయనకు మధు బహూకరించారు. ఆ చిత్రాన్ని తన సోషల్ మీడియా మాధ్యమాల్లో సోను అప్‌లోడ్ చేశారు. పెన్సిల్ ముల్లు, అగ్గిపుల్లపై ఆకృతులు చెక్కడంలో మధు దిట్ట. పెన్సిల్ లిడ్‌పై అతను మలిచిన మోదీ, శివాజీ మహరాజ్, గౌతమబుద్ధ, చాయ్ కెటిల్, ఉరితాడు ప్రత్యేక గుర్తింపును తీసుకు వచ్చాయి. 2018లో నువ్వుల గింజలపై భారతదేశపు చిత్రపటం, హనుమాన్ బొమ్మలు గీసి రికార్డులకెక్కారు. అతని కళను సోనూ అభినందించాడు.

## పరుపుల గోదాంలో మంటలు

వరంగల్ రూరల్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): జిల్లాలోని పరకాల పట్టణంలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. మారుతీ పరుపులు తయారు చేసే గోదాంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.

పెద్ద ఎత్తున మంటలు వ్యాపించడంతో పరుపులు, ముడి సరుకు పూర్తిగా కాలిపోయింది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటల అదుపునకు యత్నిస్తున్నారు. ఈ ప్రమాదంలో భారీగా ఆస్థి నష్టం వాటిల్లింది.

## మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున టాయిలెట్స్ నిర్మాణం

**-భువనగిరి పర్యటనలో వెల్లడించిన మంత్రి కెటిఆర్**

యాదాద్రిభువనగిరి,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా పట్టణాల్లో ప్రతి 1000 మందికి ఒక టాయిలెట్ చొప్పున 142 మున్సిపాలిటీల్లో 16,338 టాయిలెట్స్ నూతనంగా నిర్మించామని మంత్రి కేటీఆర్ చెప్పారు. శుక్రవారం నాడు జిల్లాలోని భువనగిరిలోని డంపింగ్ యార్డ్‌లో కేటీఆర్ సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే 5-7 ఏళ్లలో పట్టణాల్లో 53శాతం గ్రామాల్లో 47 శాతం మంది నివాసముండనున్నారని తెలిపారు. ఇందుకు తగ్గట్టుగా మౌలిక వసతులు కల్పిస్తామన్నారు. చట్టాన్ని ప్రజల చేతికి బ్రహ్మాస్త్రంలా ఇచ్చింది ఒకే ఒక్క తెలంగాణ ప్రభుత్వమేనని ఆయన తెలిపారు. మున్సిపాలిటీల్లో ప్రతీ ఫిబ్రవరి 24న పట్టణ ప్రగతి దినోత్సవం నిర్వహించి పట్టణ ప్రగతి పురస్కారాలు ఇస్తామన్నారు. రాష్ట్రంలోని 142 మున్సిపాలిటీల్లో పట్టణ ప్రగతికి ఫిబ్రవరి నుంచి ఇప్పటికే రూ. 1,112 కోట్లను ప్రతి నెలా విడుదల చేస్తున్నాం. భువనగిరికి రూ.5 కోట్లు అందించాం. పారిశుద్ధ్య కార్మికులకు ప్రతి నెలా రూ.12 వేలు ఒకటి నుంచి 5వ తేదీ లోపు చెల్లించాలని ఆదేశాలిచ్చామన్నారు. కరోనా టైంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలను మెచ్చి రూ.26 కోట్ల ప్రోత్సాహకాలతో ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఇచ్చి గౌరవించుకున్నాం. భువనగిరి పట్టణంలో పారిశుద్ధ్యంపై ద్రుష్టి పెట్టాలి. ఓడీఎఫ్ ప్లస్ కిందకు 142 మున్సిపాలిటీలు మారేలా ముందుకు పోవాలి. ప్రతి పట్టణంలో ఎఫ్ఎస్టీపీఎల్ ఎ÷-లాంట్లు వచ్చేలా చర్యలు చేపడతాం. పట్టణ ప్రధాన రహదారులు విస్తరించి మొక్కలు పెంచాలి. చెత్తను శాస్త్రీయంగా వేరు చేస్తే పరిశుభ్రతతో పాటు ఆర్థికంగా మంచి ఫలితాలు వస్తాయి. కౌన్సిలర్లు పట్టణాల్లో సమస్యాత్మక ప్రాంతాల్లో ఉన్న భూములను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలన్నారు. గాంధీ జయంతి రోజున చేపట్టిన స్వచ్ఛతా దివాస్ పేరును స్ఫూర్తితో ముందుకు తీసుకుపోతే అదే మహాత్మాగాంధీకి మనమిచ్చే నిజమైన నివాళి అని కేటీఆర్ చెప్పుకొచ్చారు. కార్యక్రమంలో మంత్రి జగదీశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ తమిళిసై భర్తకు సీఎం కేసీఆర్ సన్మానం

హైదరాబాద్,,అక్టోబర్2: గవర్నర్ తమిళిసై సౌందర్ రాజన్ భర్త డాక్టర్ సౌందర్ రాజన్‌ను ముఖ్యమంత్రి కేసీఆర్ శాలువాతో సత్కరించి సన్మానించారు. ప్రముఖ నెఫ్రాలజిస్ట్, బెస్ట్ మెడికల్ టీచర్, డాక్టర్ సౌందర్ రాజన్ కు ధన్వంతరి అవార్డు వచ్చినందుకు సీఎం కేసీఆర్ ఇవాళ నేరుగా రాజ్‌భవన్‌కు వెళ్లి ఆయనను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు గవర్నర్ ఆహ్వానం పలికారు.

రాజ్‌భవన్‌లో గవన్నర్ తమళిసై భర్త డాక్టర్ సౌందర్యరాజన్‌ను సత్కరించిన సిఎం కెసిఆర్

## డబుల్ ఇళ్ల బూచి ఇంకెంత కాలం: అంజన్

హైదరాబాద్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): డబుల్ ఇళ్లను ఆశగా చూపి ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన మంత్రివర్గ సహచరులు ప్రతీ ఎన్నికల్లో ఓట్లు వేయించుకుంటూ రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని కాంగ్రెస్ నేత అంజ్‌కుమార్ యాదవ్ అన్నారు. రానున్న గ్రేటర్ ఎన్నికల్లో ప్రజలకు మాయమాటలు చెప్పి రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారని మండిపడ్డారు.టీఆర్ఎస్ నాయకుల విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి.. వారిని చైతన్యం తెచ్చేందుకు పోరాటం చేస్తున్నామని అన్నారు. లక్ష ఇళ్లు పేరు చెప్పి వేలల్లో కూడా ఇప్పటి వరకు పేదలకు ఇవ్వలేదని అన్నీ పునాదులకే పరిమితమయ్యాయని ఆరోపించారు. గత కార్పొరేషన్, అసెంబ్లీ, లోక్‌సభ, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. మళ్లీ కార్పొరేషన్ ఎన్నికలు వస్తున్నందున అధికార టీఆర్ఎస్ నాయకులు డబుల్ ఇళ్లను అస్త్రంగా వాడుకుంటున్నారని మండిపడ్డారు. ఎక్కడా ప్రచారం చేయకుండా డివిజన్లలోని పేదలనుంచి దరఖాస్తులు తీసుకుంటున్నారని అన్నారు.

## పేదప్రజల ఆరోగ్యానికి పెద్దపీట

**నిమ్స్‌లో 250కోట్లతో**
**ఓపి విభాగం అభివృద్ధి**
**స్టెమ్‌సెల్ ల్యాబ్ ప్రారంభించిన**
**మంత్రి ఈటెల**

హైదరాబాద్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు. నిమ్స్‌ను మరింత అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అన్ని సౌకర్యాలతో రూ. 250 కోట్లతో ఓపీ విభాగం ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు నమ్మకాన్ని, విశ్వాసాన్ని పెంచేలా నిమ్స్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. నిమ్స్‌లో స్టెమ్‌సెల్స్ ల్యాబ్‌ను రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాజేందర్ మీడియాతో మాట్లాడారు. రోజుకు 10 వేల టెస్టులు చేయగల సామర్థ్యం ఈ ల్యాబ్ సొంతమని మంత్రి తెలిపారు. బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడేవారికి ఈ ల్యాబ్ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రాష్ట్రంలో 40 లక్షల మందికి యాంటీబాడీస్ డెవలప్ అయ్యాయని ఐసీఎంఆర్ చెప్పిన విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. కరోనా వైరస్ వ్యాప్తి పట్ల ప్రభుత్వం అప్రమత్తంగా ఉంది. కొద్ది మందిలో ఈ వైరస్ లక్షణాలు అగుపిస్తున్నాయి. కొందరిలో అగుపించడం లేదు. ఈ క్రమంలో ప్రజలు కూడా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. టిమ్స్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నాం. దీంట్లో కూడా వైద్యసేవలు అందుతున్నాయి. నగరానికి నలువైపులల అద్భుతమైన వైద్యశాలలు నిర్మించబోతున్నామని తెలిపారు. రాష్ట్రంలో వైద్యారోగ్య శాఖను మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని మంత్రి ఈటల రాజేందర్ స్పష్టం చేశారు.

## ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

**ప్రత్యేక తెలంగాణలో అభివృద్ధి సాధించాం**
**భువనగిరిలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కెటిఆర్**

భువనగిరి,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని మంత్రి కెటిఆర్ పేర్కొన్నారు. సంక్షేమ ఫలాలు ప్రజలందరికీ అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. గత సమైక్య పాలనలో అన్ని విధాల దోపిడీకి గురైన తెలంగాణ, స్వరాష్ట్రం వచ్చాక సిఎం కెసిఆర్ నేతృత్వంలో అన్ని విధాల అభివృద్ధి సాధించిందని ఆయన పేర్కొన్నారు. శుక్రవారం భువనగిరి మున్సిపాలిటీ పరిధిలో ఆయన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. అలాగే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ ఫలాలు ప్రజలకు అందేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని ఆయన ఆదేశించారు. గాంధీ జయంతి సందర్భంగా స్వచ్ఛత దినోత్సవం పాటిస్తున్నా మని, పట్టణాల్లో, పల్లెల్లో పారిశుధ్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలని కెటిఆర్ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని డంపింగ్ యార్డులో నిర్మించిన మానవ మలవ్యర్థాల శుద్ధీకరణ కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆర్‌అండ్‌బీ గెస్టుహౌస్ సమీపంలో 14వ, 15వ ఆర్థిక సంఘం, పట్టణ ప్రగతి నిధులు రూ.8.70కోట్ల వ్యయంతో నిర్మించనున్న సమీకృత మార్కెట్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఆర్‌అండ్‌బీ వసతిగృహం ఆవరణలో నిర్మించనున్న నిరాశ్రయుల వసతి గృహానికి శంకుస్థాపన చేశారు. ఐబీ కార్యాలయం ముందు ఎన్‌యూఎల్‌ఎం, పట్టణ ప్రగతి నిధులు రూ.11.50లక్షల వ్యయంతో వీధి వ్యాపారుల కోసం నిర్మించిన 25 దుకాణాలను మంత్రి ప్రారంభించారు. 30, 31, 32, 34వార్డుల్లో రూ.31.50లక్షలతో 197మీటర్ల మేరకు ఎల్ఆర్ఎస్ నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. 14వ ఆర్థిక సంఘం, పురపాలక సంఘ సాధారణ నిధులు రూ.1.51కోట్లతో నిర్మించనున్న స్మృతివనం ఆధునిక పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్ రెడ్డి, భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత తదితరులు పాల్గొన్నారు.

భువనగిరిలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న మంత్రి కెటిఆర్. చిత్రంలో ఎంపి కోమటిరెడ్డి,మంత్రి జగదీశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

**చరిత్రలో నేటినిజం**

కం॥ భరత సుసంసరతినెల్లను
వరతాయము గాన్నాన్ప్రజలమనములన
బరిరక్షించుజేయు నిలచి
చిరయుతుడయ్యెను "గజేంద్రసింగ్ షెరావత్"!!

( అక్టోబర్ 3 గజేంద్రసింగ్ షెరావత్ జననం..)

-రాధశ్రీ
సెల్: 9494481210



నేటినిజం
శనివారం 3-10-2020

# పాలనలో గాంధీమార్గాన్ని ఆచరించాలి

ఏటేటా గాంధీకి నివాళి అర్పించి మొక్కులు తీర్చుకుంటున్న నేతలు గాంధీ మార్గంలో నడుస్తున్నామా.. ఆయనకు నిజమైన నివాళి అర్పిస్తున్నామా..అన్నది ఆలోచించాల్సిన సమయం. గాంధీని స్మరించడంతో ఆశయాలు నెరవేరవు. మహాత్ముడి ఆశయాలు నెరవేరాలంటే ప్రవచించిన సిద్ధాంతాలను కొంతయినా నెరవేర్చేలా యత్నించాలి. అధికారం ఉన్నా..నిధులు సమకూరుతున్నా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను ఎందుకు మార్చలేకపోతున్నామో ఆలోచించాలి. చిత్తశుద్ధి ఉంటే ఎంతటి కఠిన పరీక్షలయినా ఎదుర్కోవచ్చని గాంధీజీ నిరూపించారు. కొందరు అక్కడక్కడా తమ పాలనలో కొంత చిత్తశుద్ధిని ప్రదర్శించినా..దేశం మొత్తంగా ఈ ఆలోచన రావాలి. గాంధీ మార్గంలో గ్రామాలను అభివృద్ధి చేయాలి. అహింసతో ప్రజలను ముందుకు తీసుకుని వెళ్లాలి. ప్రజలే తమ అధి÷–ఆరానికి కారకులు కనుక వారికి మేలు చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగాలి. 151వ జయంతి ఉత్సవాల సందర్భంగా ఇప్పటికీ బాపూ ఆదర్శాలు ఆచరణీయంగానే ఉన్నాయి. నేటి రాజకీయ నాయకులు బాపూను తలచి దండలు వేయడం తప్ప ఆయన ఆశయాలను తుంగలో తొక్కారు. ఈ దేశం ఎంతో ప్రగతి సాధించడానికి అవకాశం ఉన్నా స్వార్థ రాజకీయాల కారణంగా ముందుకు సాగలేకపోయాం. స్వాంత్ర్యం వచ్చి 73 ఏళ్లు దాటినా ఇంకా దరిద్ర నారాయణులగానే అనేకులు మిగిలారు. రాజకీయం అంటే అధికారం అనుభవించడం తప్ప దేశాన్ని గురించి ఆలోచన చేయని నేతలు ఇవాళ రాజ్యమేలుతున్నారు. అప్పనంగా సంపాదించడం, అధికారం వెలగబెట్టడం అలవాటుగా చేసుకున్నారు. ఆ సంకల్పంతో ఆయనకు నివాళి అర్పిస్తే బాపూ కూడా ఆనందిస్తాడు. తాను నమ్మిన అహింసా సిద్ధదాంతం కావచ్చు లేదా... ఉద్యమపంథా కావచ్చు...ఆచరించి బ్రిటిషు వారికి వ్యతిరేకంగా గాంధీ పోరాటం చేశారు. బ్రిటిషు వారిచేతనే భేష్ అన్పించుకోవడమే గాకుండా వారిని గడగడలాడించారు. గాంధీ ప్రత్యేకత అంటే అదే. ఆయన తను చెప్పిన సిద్ధాంతాన్ని ఆచరించారు గనుకనే అశేషమైన ప్రజల మద్దతు సాధించగలిగారు. దేశ ప్రజల ఆలోచన స్థితిని, వారి చైతన్యాన్ని గుర్తించి వారిని ఉద్యమంలోకి రప్పించాలో గ్రహించిన గాంధీ స్వాతంత్ర్యాన్ని సాధించగలిగారు. అందుకే ఆయన నాటి భారత సమాజాన్ని కదలించేందుకు చాలా చిన్నచిన్న విషయాలనే ఎంచుకున్నారు. అంతేకాదు ప్రజల నిత్య జీవితంపై ప్రభావం చూపించే ఉప్పును ఉద్యమానికి ఆయుధం చేసుకున్న ధీశాలి. నిత్యావసరాలను, అత్యంత ప్రభావం చూపే అంశాలే ఆయన ఉద్యమ ఇతి వృత్తాలు. అందుకే దండి ఉప్పు సత్యాగ్రహం యావత్ దేశాన్ని కదలించింది. అందుకే అంతకు ముందు ఎంతో మంది స్వతంత్ర ఉద్యమాన్ని నడిపినా గాంధీకి ముందు గాంధీ తర్వాత అనే విభజన రేఖ వచ్చింది. అంతలా ఉద్యమాలను, ప్రజలను, పాలకుల ను గాంధీ ప్రభావితం చేశారు. ఒక్క మాటలో చెప్పాలంటే తెల్లవారిని తరిమి కొట్టేందుకు ఎలాంటి ఆయుధాలు అక్కర్లేకుండా ముందుకు సాగిన ఉక్కు సంకల్పం గాంధీ సొంతం. నాడు బ్రిటిషు ప్రభుత్వంపై యుద్ధం చేయడానికి ఆయన అహింసను ఆయుధంగా చేసుకున్నాడు కనుకనే బలవంతులైన వారిని ఎదిరించ గలిగారు. ప్రజలు కూడా ఎక్కడిక్కడా అహింసతో అడ్డుకున్నారు. గోచీ పెట్టుకున్న ఈ పెద్దాయనతో తమకు పేచీ లేదని బ్రిటిషు పాలకులు భావించేలా చేశారు గాంధీ. కానీ ఆయనే తన శాంతియుత పద్ధతులతో బ్రిటిషర్లను గడగడలాడించాడు. ఆనాటి ఉద్యమాన్ని ప్రత్యక్షంగా చూసిన వారు గాంధీ పట్ల ఆరాధ్య భావం పెంచుకున్నారు. ఆయన ఉద్యమానికి ముగ్ధులయ్యారు. ఇంతటి అసాధారణ ప్తరిభ కలిగిన ఓ వ్యక్తి రక్త మమాంసాలతో ఈ భూమ్మీద జీవించాడంటే నమ్మలేకపోతున్నామంటూ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ గాంధీ గురించి చేసిన వ్యాఖ్యలు మహాత్ముడి గొప్పతనానికి నిదర్శనాలు. తాను చెప్పిన సిద్ధాంతాన్ని ఆచరించి చూపిన మహనీయుడు బాపు. ఆచరణనీయమైన ఉద్యమ మార్గాల ద్వారా ఆయనను ముట్టుకోవాలంటే కూడా నాటి పాలకులు భయపడ్డారు. ప్రజలను తమ సమస్యల పట్ల ముందు కు తీసుకుని వెళ్లాలన్న విషయాలను సూటిగా, భక్తి మార్గంలో, నైతిక మార్గంలో బోధించారు. ఆవే ఆయనను మహాత్ముడిగా నిలబెట్టాయి. చెప్పిన వాటిని ఆచరించడం వల్లనే ప్రపంచ చరిత్రలో ఆయన చిరస్మరణీయమైన వ్యక్తిగా నిలబడ్డాడు. గాంధీజీ చెప్పిన చాలా విషయాలు నేటి ఉద్యమాలకు, ప్రభుత్వా లకు, దేశాలకు ఎజెండాలవుతున్నాయి. ప్రపంచానికి మహాత్మా గాంధీ శాంతి మార్గాన్ని చూపడమే కాకుండా గొప్ప ఆధ్యాత్మిక సంపదను వారసత్వంగా అందించారు. గాంధీజీ తన బోధనలు, నడవడి ద్వారా ప్రపంచా నికి గొప్ప ఆధ్యాత్మిక వారసత్వ సంపదను అందించారు. గాంధీ భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని అహింసా మార్గంలో నడిపించిన తీరుతోనే ఆయనపై నేటికీ పరిశోధనలు కొనసాగుతున్నాయి. అనేక దేశాలు ఆయన చూపిన మార్గంలో పయనించే ప్రయత్నాలు చేస్తున్నాయి. సామాజిక కార్యకర్త అన్నా హజారే కూడా గాంధీ చూపిన అహింసామార్గంలోనే ముందుకు సాగి దేశంలో కదలిక తీసుకుని వచ్చారు. గాంధీ తర్వాత అవినీతి గురించి, రాజకీయాల్లో మార్పు వంటి అంశాలు జాతీయ అజెండా అయ్యాయి. అవినీతికి వ్యతిరేకంగా రాలేగాంవ్ సిద్ధీలో ఉండే హజారే యావత్ దేశాన్ని కదలించాడు. ముఖ్యంగా ఈ తరం అంతా జాతీయ జెండాలతో ఆయన వెనుకే నిలబడింది. లాఠీ దెబ్బలు లేకుండా, హింసాపద్ధతులకు తావీయకుండా ఆయన జాతీయ జెండా చేత పట్టారు. గాంధీ టోపీ పెట్టారు. 'గాంధీనే నా మార్గం' అన్నారు. యావత్ దేశాన్ని తన వెంట నడిపించుకున్నారు. ఈ తరం నెత్తుల మీద గాంధీ టోపీలు పెట్టుకోవడానికి నాటి గాంధీ ఆలోచన, ఆచరణ తప్ప మరోటి కాదు. అంటే ఉద్యమాలు చేసే వారికి తరతమ బేధాలు లేకుండా ఉద్యమంలోకి వచ్చే స్ఫూర్తికి గాంధీనే పునాది అని గుర్తించాలి. ఈ దశలో మన గడ్డమీద పుట్టిన మన మహాత్ముడిని, ఆయన ఆశయాలను విస్మరించడం సరికాదు. పాలకులు తమ దృష్టిలో ఒకింత గాంధీమార్గంపై దృష్టి సారిస్తే పల్లెలు, పట్టణాలు, రాష్ట్రం, దేశం బాగుపడగలదు.

## దసరాకల్లా రైతువేదికలు పూర్తి కావాలి: కలెక్టర్

మహబూబాబాద్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ):రైతు వేదికలు త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో రైతు వేదికల నిర్మాణ పనులపై సమీక్షించారు. దసరా నాటికి రైతు వేదికలు పూర్తి కావాలన్నారు. మారుమూల మండలాలైన కొత్తగూడ, గంగారం లో రైతు వేదికల నిర్మాణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని, వాటిని ఆదర్శంగా తీసుకొని మిగతా మండలాల పనులు పూర్తి చేయాలన్నారు. డోర్నకల్, నెల్లికుదురు, పెద్దవంగర, దంతాలపల్లి మండలాల్లో కూడా పనులు వేగవంతంగా జరుగుతున్నాయన్నారు. మరిపెడలో మూడు గ్రామాలు, కురవిలో ఒక గ్రామంలో పనులను అశ్రద్ధ చేస్తున్నారని, ఆ నాలుగు గ్రామాల సర్పంచ్‌లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని డీపీవోను ఆదేశించారు. వానకాలం సీజన్‌కు సంబంధించి ధాన్యాన్ని బియ్యంగా మార్చి 5వ తేదీలోగా అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు. వానకాలానికి సంబంధించిన రైస్‌మిల్లుల్లో పెండింగ్‌లో ఉన్న 2,270మెట్రిక్ టన్ను ల ధాన్యాన్ని బియ్యంగా మార్చి 5వ తేదీలోగా అందజేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలోని ఇండ్లు, స్థలాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు.

## రైతుల సమస్యలు పట్టని బిజెపి: వంటేరు

గజ్వేల్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): కేంద్ర ప్రభుత్వం రైతుల సమస్యలు పట్టనట్లుగా వ్యవహరిస్తోందని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. రైతు సంక్షేమమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా పథకాలతో పాటు ఉచిత కరెంట్ సరఫరా చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిందన్నారు. నూతన రెవెన్యూ చట్టంతో భూ సంస్కరణలకు సీఎం కేసీఆర్ శ్రీకారం చుట్టారని తెలిపారు. డిజిటల్ సర్వే చేసి ప్రతి గుంట భూమికి మ్యాప్ సిద్ధం చేసి పాస్‌బుక్కులు అందిస్తామని అన్నారు. బీడువారిన భూములను కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలతో అభిషేకించిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. అంబేద్కర్ ఆశయాలను సీఎం కేసీఆర్ అమలు చేస్తూ, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషిచేస్తున్నారని అన్నారు. కానీ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించి ఉరి బిగిస్తోందని అన్నారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు.

### గ్రామ పరిధిలోని అన్ని నిర్మాణాల

## వివరాలు నమోదు చేయాలి

**– సంబంధిత సిబ్బందికి ఆదేశించిన జిల్లా కలెక్టర్ హనుమంతరావు .**



సంగారెడ్డి, అక్టోబర్ 2 (నేటినిజం ప్రతినిధి) శుక్రవారం కంది మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది చేపట్టిన గ్రామంలో నిర్మాణల వివరాల నమోదు ప్రక్రియను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పరిధిలో ని అన్ని నిర్మాణాల వివరాలు నమోదు చేయాలని సూచించారు. యజమాని పేరు, ఆధార్ నంబర్, చరవాని నంబర్, నిర్మాణం స్వభావం, విస్తీర్ణం కొలతలు తీసుకోని నమోదు చేయాలన్నారు.

అన్ని రకాల నిర్మాణలు ఆన్ లైన్ లో నమోదు ఐతే భవిష్యత్ లో ఎలాంటి ఇబ్బందులు ఉండవని అధికారులకు సూచించారు. గ్రామంలోని ప్రతి ఇంటి కి వెళ్లి యజమాని తో మాట్లాడి అన్ని వివరాలను సేకరించాలని సూచించారు.

కలెక్టర్ వెంట డివిజనల్ పంచాయతీ అధికారి,సర్పంచ్ ,తదితరులు పాల్గొన్నారు.

జాతి పిత మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం జెడ్పీ ఆవరణలో గల గాంధీ విగ్రహానికి పూల మాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన సంగారెడ్డి జిల్లా కలెక్టర్ హనుమంతరావు., జెడ్పీ సీఈవో ఎల్లయ్య.

# గాంధీ అహింసా మార్గంపై ప్రపంచ దేశాల ఆసక్తి

**గాంధీ రాకతోనే మారిన స్వాతంత్ర్య ఉద్యమ రూపం**
**ఆహార్యంతో పాటు..అనుసరణలో రాజీపడని మహాత్ముడు**
**అహింస అనే ఆయుధమే ఊతకర్రగా చేసుకుని పోరాటం**

న్యూఢిల్లీ,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): గాంధీ చూపిన అహింసా మార్గంపై ప్రపంచ దేశాల్లో అనేక పరిశోధనలు సాగుతున్నాయి. ఆయన మార్గంలో పయనించేందుకు అనేకమంది ప్రయత్నిస్తున్నారు. ఆయన హింస చేయడం లేదు?. అందరి లాగే స్వాతంత్ర్యం కోరుతున్నారు. కానీ నాటి అందరి నాయకులంటే తిరుగులేని నేత అయ్యారు. ఇంకా చెప్పాలంటే స్వతంత్ర ఉద్యమం 1920ల తర్వాతనే ప్రారంభం అయింది. చాలా ప్రభావవంతంగా గాంధీజీ దూసుకొచ్చారు.

ఏయే అంశాలను తీసుకుంటే ప్రజలు కదులుతారు. ప్రజలను ఎట్లా ఉద్యమంలోకి రప్పించాలి. దక్షిణాఫ్రికా నుంచి వెనక్కు వచ్చిన గాంధీ, ఆ వెంటనే భారత జాతీయోద్యమంలో ప్రవేశించారు. తాను అభిమానించే గోఖలే స్థానాన్ని భర్తీ చేయాలను కున్నారు. తిలక్, చంపారన్, రౌలట్ చట్టం, సహాయనిరాకరణ, ఖిలాఫత్ ఉద్యమం ఈ వరుస సందర్భాలతో తనను తాను నిలబెట్టుకున్నాడు. అహింసను ఊతకర్రగా చేసుకుని విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్తు వినియోగం, అస్పృశ్యతా నివారణ వంటి కార్యక్రమాలను ప్రతిపాదించి, దేశవ్యాప్తంగా జాతీయోద్యమానికి విస్తృతమైన పునాదిని నిర్మించారు. జాతీయోద్యమాన్ని ఏకోన్ముఖంగా తీసుకుని పోవడానికి ఆయన అనుస రించిన అనేక పద్ధతుల్లో తన ఆహార్యం కూడా ఒకటి. కొల్లాయి కట్టిన గాంధీని చూస్తే ఇవాళ నిర్లిప్తంగా అనిపించవచ్చును కానీ, అది ఆయన తన రాజకీయ లక్ష్యసాధనకు ఎంచుకుని ధరించిన ఆహార్యం. ఆయన తనను తాను ప్రజల ముందు నిలబెట్టుకోవడానికి తనకంటూ ప్రత్యేకతను సాధించారు. బలహీనుడిలాగా, బాధితుడిలాగా, ఒక గ్రామీణ భారతీయుడి రూపురేఖలకు దగ్గరగా ఉండాలనుకున్నాడు. ఇలా చెప్పిన సిద్ధాంతాలను ఆచరిస్తూ అందరినీ కలుపుకుని ముందుకు తీసుకుని పోవడం ద్వారా బలమైన బ్రిటిషర్ల నుంచి దేశ దాస్య శృంఖలాలను తెంచగలిగారు. ఆయన ఏదైతే చెప్పారో..దానినే అనుసరించారు. అలాంటి వారినే తన వెంట ఉంచుకున్నారు. వారిని మాత్రమే ప్రోత్సహించారు. అందుకే భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్ లాంటి విప్లవభావాలున్న వారు ఆయనను అనుసరించలేక పోయారు. బ్రిటిషర్ల దాష్టీకాన్ని ఎండగడుతూ వారికి వ్యతిరేకంగా భారత జాతీయోద్యమం 1857లో ఉవ్వెత్తున ఎగిసినా దానికి ఓ ఉద్యమ పంథా లేదనే చెప్పాలి. అక్కడక్కడా వచ్చిన నిరసనలు బ్రిటిషర్లపై ఉద్యమించడానికి ఊతమయ్యాయి. అయితే గాంధీ ప్రవేశం తరవాతనే ఉద్యమం ఓ పద్ధతిలో ముందుకు సాగిందనే చెప్పాలి. ఆనాటి ప్రథమ స్వాతంత్ర్య పోరాటం లేదా తిరుగుబాటు దీర్ఘకాలం పాటు, బహుముఖంగా సాగింది. ఏ ఒక్కరి నాయకత్వంలో ఆది సాగలేదు. అనేకమంది తిరుగుబాటుదారులు తమకుతాముగా ముందు నిలబడి బ్రిటిషర్లను ఎదుర్కొనే ప్రయత్నం చేశారు. అందుకే ఆనాటి పోరాటం లేదా జాతీయోద్యమం పతాకస్థాయికి చేరలేదు. దక్షిణాఫ్రికా నుంచి వెనక్కు వచ్చిన గాంధీ, ఆ వెంటనే భారత జాతీయోద్యమంలో ప్రవేశించారు. తాను అక్కడ అవమానానికి గురైన తరవాత ఈ తెల్లవారి అహంకారాన్ని అణచివేసేందుకు భారత జాతీయ ఉద్యమంలో కీలకభూమిక కావాలన్న సంకల్పంతోనే రంగంలోకి దిగారు. తనకంటూ ప్రత్యేకతను రూపొందించుకుని బలవంతుడైన శత్రువును బలహీనమైన వ్యక్తిగా కనిపిస్తూనే ఎదరించే సాహసం చేసాడు. దక్షిణాఫ్రికాలో రైలుబండిలో ఆయనకు ఎదురైన చేదు అనుభవం నుంచి, బ్రిటిష్ పాలనలో మనిషిగా, భారతీయుడిగా తనకు హక్కులు లేవని గుర్తించాడు. అంతే కాదు, భారతీయుడు కావడం వల్లనే తనకు మానవహక్కులు లేవని తెలుసుకున్నాడు. ఈ తెలివిడిని భారతదేశంలోని కులవ్యవస్థకు అన్వయించి చూడాలని ఆయన అనుకోలేదు. డర్బన్ నగరంలో ఫీనిక్స్ ఇంట్లో ఉన్నప్పుడు, అతిథి ఉపయోగించిన మరుగుదొడ్డి శుభ్రం చేయనందుకు భార్య కస్తూర్బాను చలిరాత్రిలో తెల్లవార్లూ ఇంటివెలుపల ఉంచి శిక్షించాడు గాంధీ. ఆమె ఆ శిక్షను ఎంతో నిష్ఠగా అనుభవించడం చూసి, ఆయనకు సహనం, అహింసల గొప్పతనం తెలిశాయని అంటాడు. భారతదేశంలో అప్పటికే ఉన్న విప్లవ ధోరణులను మినహాయించడానికే అహింసను ఒక ప్రధాన ప్రాతిపదికగా ఆయన తీసుకున్నారని అనుకోవాలి. అందుకే భగత్‌సింగ్, సుభాష్ చంద్రబోస్ వంటి వారి చర్యలను అంగీకరించ లేదు. భగత్‌సింగ్ వంటి యోధుల ఉరిశిక్షల విషయంలో కానీ, దండి సత్యాగ్రహం సందర్భంగా చౌరాచౌరీలో ప్రజాగ్రహం విషయంలో కానీ గాంధీ తన మూల సిద్ధాంతాన్ని వదులుకోలేదు. ఉద్యమంలో హింస చెలరేగితే అనేక ఇతర సందర్భాలలో జనం ఆవేశాలను చల్లార్చిన తరవాతనే ముందుకు కదిలారు. తాను హిందువునే కానీ భారత సమాజం మత సమాజంగా ఉండకూడదంటారు. సంపన్నులైన వారు సమాజ సంపదకు ధర్మకర్తలుగా వ్యవహరించి, ఇతరులను ఆదుకోవాలంటారు. మొత్తం మీద ఉద్యమానికి నైతికతను జోడించడం ద్వారా, కొత్త రాజకీయ వ్యూహరచన చేశారు గాంధీ.నాటి అతివాద హైందవ శక్తులు, కమ్యూనిస్టులు కూడా ఎవరి కారణాలకు వారు ఉద్యమాన్ని ఉధృతం చేయడానికి విముఖంగా ఉన్న కాలంలో, గాంధీ క్విట్ ఇండియా నినాదానికి సిద్ధపడ్డారు. దేశవిభజన మాత్రం గాంధీ చరిత్రలో ఓ మచ్చగా మిగిలింది.

# తెలంగాణ ఉద్యమ దార్శనికుడు గాంధీ

**అహింసా విధానంలో సాధించిన ఆధునిక విప్లవం**

హైదరాబాద్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): నేటి ఆధునిక సమాజంలో గాంధీ ఉద్యమ పంథాను ఎంచుకున్న కారణంగానే ప్రత్యేక తెలంగాణ సాధ్యం అయ్యిందని సిఎం కెసిఆర్ పలు సందర్భాల్లో ప్రకటించారు. గాంధీ సూచించిన గ్రామీణ ఉద్యమాన్ని తాము ముందుకు తీసుకుని వెళుతున్నామని కూడా ప్రకటించారు. తెలంగాణ ఉద్యమం సొంతం గాంధేయ మార్గంలోనే నడిచింది. అహింసామార్గంలో కేవలం నిరసనలు, అరెస్ట్‌లతో కెసిఆర్ ఉద్యమాన్ని గాంధీ అహింసామార్గంలో పయనించేలా చేశారు. అయితే ఆనాడు గాందీకి ఎదురైన సంఘటనలు తెలంగాణ ఉద్యమంలోనూ కానవచ్చాయి. బలిదానాలు ఇందులో ప్రధానంగా చెప్పుకోవాలి. తెలంగాణ కోసం ఎలుగెత్తిన ఎందరో యువకిశోరాలు తమ జీవితాలను త్యాగం చేశారు. ఉద్యమంలో పాల్గొన్న కెసిఆర్ కావచ్చు, ప్రొఫెసర్ కోదండరామ్ కావచ్చు..యాత్ తెలంగాణ ప్రజలు గాంధీ అనుసరించిన అహింసామార్గంలోనే ముందుకు సాగారు. అందుకే ఎక్కడా హింసకు తావులేకుండా ఉద్యమం సాగి విజయం సాధించింది. ఇది ప్రపంచానికి మరోమారు గాంధీ గొప్పతనానికి నిదర్శనంగా నిలిచింది. ఈ విషయాన్ని కెసిఆర్ పదేపదే ప్రకటించారు. గాంధీ పేరు ఎత్తుకున్న తర్వాత ప్రభుత్వాలు ఏమీ చేయలేక పోయాయి. పైగా ప్రజలు స్వచ్ఛందంగా, స్వేచ్ఛగా రోడ్లపైకి వచ్చి ఉద్యమించారు. ఇది మన కళ్ల ముందు జరిగిన చరిత్ర. ఈ ఉద్యమం విజయం సాధించింది. 1952 కానీ, 1969 ఉద్యమాల్లో గాంధీ సిద్ధాంత ప్రస్తావన లేదు. అందు వల్ల నాటి ప్రభుత్వాలు వాటిని అణిచివేయగలిగాయి. ఈ సారి ఉద్యమంలో గాంధీ ముందు వరుసలో ఉన్నారు. గాంధీ సిద్ధాంత ఆధార ఉద్యమమని ఆచరణ ద్వారా ఉద్యమ నాయకత్వం చూపించింది. అందు వల్ల తెలంగాణకు పోరాటాలే తప్ప విజయాలు లేవు అనే వేదనను తొలగించిందీ గాంధీ మార్గమే. కేజీవ్రాల్ వంటి వారు రాజకీయాల్లోకి వచ్చి ముఖ్యమంత్రి అయ్యారు. ఈయనకూ స్ఫూర్తి గాంధీనే. ఆయన చేసిన ఆందోళనలు, ధర్నాలన్నీ గాంధేయ మార్గంలోనే సాగాయి. ఎక్కడ హర్తాళ్ చేసినా గాంధీనే స్ఫూర్తిగా తీసుకున్నారు. మొత్తంగా కేజీవ్రాల్ వెంట ఢిల్లీ నడిచింది. కానీ వారిని నడిపించింది గాంధీనే. అందుకే కేజ్రీవాల్ అవినీతి వ్యతిరేక ఉద్యమంలో అన్నా హజారేతో కలసి ఉద్యమించి విజయం సాధించారు. హింసను, ప్రతీకారేచ్ఛను ఆదర్శంగా చూపించే సినిమాలను ఆరాధించే జనం దృష్టిలో అహింస పెద్ద ఆదర్శం కాదు. కానీ అహింసా పద్ధతుల్తో పోరాటం నిజజీవితంలో మాత్రం హీరోజయిజంగానే నిలబడుతుందని తెలంగాణ ఉద్యమం నిరూపించింది. తెలంగాణ ఉద్యమంలో రక్తం చిందకుండా నాయతక్వం ముందుకు సాగాలన్న నిర్ణయానికి గాంధీ ఆచరణెళి ప్రేరణ.

## 9నుంచి బతుకమ్మ చీరల పంపిణీ

భద్రాద్రి కొత్తగూడెం,అక్టోబర్2 (ఆర్ఎన్ఎ): ఈ నెల 17వ తేదీ నుంచి బతుకమ్మ సంబరాలు ప్రారంభం కాబోతున్నందున కరోనా నియంత్రణ జా గ్రత్తలు పాటిస్తూ చీరల పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ ఎంవీ రెడ్డి తెలిపారు. జిల్లాలో అక్టోబర్ 9 నుంచి బతుకమ్మ చీరల పంపిణీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఐదు నియోజకవర్గంలో నిరుపేదల ఎంపిక చేసిన మహిళలు జాబితా ప్రకారం బతుకమ్మ పండుగకు ప్రభుత్వం పేదింటి ఆడబిడ్డకు చీరలను పంపిణీ చేస్తుందన్నారు. ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు చీరెలు పంపిణీ పూర్తిచేయాలన్నారు. చీరెల పంపిణీలో మహిళా సంఘాల సహకారం తీసుకోవాలని కోరారు. చీరెలు పంపిణీ కార్యక్రమం నిర్వహణకు ప్రతి నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిని నియమిస్తున్నట్టు ఆయన తెలిపారు.

గాంధీజీ జయంతి సందర్భంగా కరీంనగర్‌లో గాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పించిన మంత్రి గంగుల కమలాకం

## తెలంగాణ కాంగ్రెస్‌కు మాణికం టానిక్

**పోరాటాలతో పార్టీని పటిష్టం చేసే వ్యూహం**
**శ్రేణుల్లో ఉత్సాహం నింపుతూ ముందుకు సాగాలని నిర్ణయం**

హైదరాబాద్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): వివిధ అంశాలపై పోరాటం ద్వారా మళ్లీ పట్టు సాధించేందుకు కాంగ్రెస్ పార్టీ ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. కాంగ్రెస్ పార్టీకి కొత్త పరిశీలకుడిగా వచ్చిన మాణికం ఠాగూర్ ఆధ్వర్యంలో వరుసగా రెండోసారి ఆందోళనలకు సిద్ధమయ్యారు. తొలుత గవర్నర్‌కు వినతిపత్రం సమర్పించిన నేతలు, ఇప్పుడు సంగారెడ్డిలో ధర్నాలకు దిగారు. ఆయన వచ్చీరావడంతో సమీక్షలు చేపట్టి శ్రేణులను ఉత్సాహపరిచారు. కాంగ్రెస్ పార్టీ జిల్లాల్లో పూర్వవైభవం సాధించే దిశగా దృష్టిసారిస్తున్నది. పార్టీ ఇప్పుడు పునాదుల స్థాయి నుంచి మళ్లీ పునర్నిర్మాణం చేయాల్సిన స్థితికి వచ్చింది. తిరిగి కార్యకర్తల్లో కొత్త ఉత్సాహాన్ని నింపేందుకు కసరత్తు ప్రారంభించారు. ఏఐసీసీ అధినాయకత్వం రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జిని మార్చడంతో ఆయన మార్గదర్శకత్వంలో పార్టీలో మళ్లీ పునరుత్తేజం తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. ఆయన నాయకత్వంలో పార్టీని పునర్నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. స్థానిక సంస్థలు, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో పరాజయం పాలైన ఆ పార్టీ పూర్తిగా నీరస పడి పోయింది. ఇలాంటి స్థితిలో పార్టీ శ్రేణులకు కొత్త ఉత్సాహాన్ని నింపాలని అందుకోసం గ్రామీణ స్థాయి నుంచి పునర్నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టాలని భావిస్తున్నారు. ఇందుకోసం బూత్ కమిటీల స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీని పునర్నిర్మించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నట్లు తెలుస్తోంది. పార్టీ వ్యవస్థాగత నిర్మాణాన్ని పూర్తి చేస్తారు. అలాగే స్థానిక సమస్యలను పరిష్కరించే దిశగా ప్రజలను భాగస్వాములను చేస్తూ ఎక్కడికక్కడ ఉద్యమాలు చేపట్టాలని, సమస్యల సాధనే లక్ష్యంగా కాంగ్రెస్ కార్యక్రమాలు రూపొందాలని వారు భావిస్తున్నారు. కార్యకర్తలు ప్రతిరోజు ఏదో ఒక కార్యక్రమం చేపడుతూ ప్రజల్లో ఉండాలని అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు ఏ సమయంలో వచ్చినా అధికార పార్టీతో ఢీకొని ఈసారి పూర్వవైభవాన్ని సాధించాలని నాయకత్వం భావిస్తున్నది. అందుకు కాంగ్రెస్ కార్యకర్తలందరిని కార్యోన్ముఖులను చేసే దిశగా ముందుకు సాగుతున్నది. దీనికితోడు రానున్న ఎమ్మెల్సీ, దుబ్బాక ఉప ఎన్నిలకను ప్రతిస్పాత్మకంగా తీసుకుని ముందుకు సాగనున్నారు.

## అభివృద్ధి పనుల్లో ముందున్న తెలంగాణ

**ఆర్థిక సంక్షోభంలోనూ ఆగని కార్యక్రమాలు**
**దంసలాపురం ఆర్వోబీ నిర్మాణ పనులను పరిశీలించిన పువ్వాడ**

ఖమ్మం,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): సంక్షేమ అభివృద్ధి పనుల్లో తెలంగాణ ముందున్నది రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. ఆర్థిక సంక్షోభంలోనూ ఏ కార్యక్రమం కూడా ఆగకుండా ముందుకు సాగుతోందన్నారు. ప్రజల చిరకాల వాంఛ అయిన దంసలాపురం ఆర్వోబీ బ్రిడ్జి నిర్మాణ పనులను మంత్రి పువ్వాడ గురువారం పరిశీలించారు. రూ.74కోట్లతో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చాయని అధికారులు వివరించారు. ఖమ్మం–బోనకల్‌కు అనుసంధాన పనులను తుదిదశకు చేరుకున్నాయి. మరో 15 రోజుల్లో ప్యాచి పనులు రంగులు, మొక్కలు తదితర పనులను పూర్తి చేయాలని అధికారులను మంత్రి పువ్వాడ ఆదేశించారు. ఈ దసరా నాటికి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదగా లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఎన్నో ఏండ్ల నాటి కల సాకారం కానుందని మంత్రి పేర్కొన్నారు. ఇదిలావుంటే తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన రెవెన్యూ చట్టంలో భాగంగా.. ఖమ్మం నగరంలో ప్రభుత్వ స్థలాల్లో పేదలు ఇండ్ల నిర్మించుకొని ఎలాంటి భద్రత లేకుండా ఉన్న నివాసాలకు మెరూన్ రంగు పాస్ బుక్ ను మంజూరు చేయనున్నట్లు మంత్రి కుమార్ తెలిపారు. ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని 6వ డివిజన్ వైఎస్ఆర్ నగర్ కాలనీ, 26వ డివిజన్ రమణగుట్ట, 27వ డివిజన్ రేవతి సెంటర్, 34వ డివిజన్ దొరల కాలనీ(రమణగుట్ట)లో మంత్రి పర్యటించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మెరూన్ పాస్ బుక్‌పై ప్రజల్లో అపోహలు, అనుమానాలు తొలగించి చైతన్యం, అవగాహన కల్పించేలా స్థానిక కార్పొరేటర్లు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం స్థానికంగా నివాసం ఉంటున్న ప్రజలతో మాట్లాడారు. పక్కాగా రికార్డుల్ల

## అసత్యానికి వ్యతిరేక పోరాటంలో అడ్డంకులను లెక్కచేయను

### –తానెవరికీ భయపడేది లేదంటూ రాహుల్ ట్వీట్

న్యూఢిల్లీ,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): ఈ ప్రపంచంలో తాను ఎవరికీ భయపడను అని గాంధీ జయంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఎంపీ రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. గాంధీ జయంతి సందర్భంగా ఆయన ట్వీట్ చేస్తూ ఈ విషయాన్ని ఉటంకించారు. నేను ప్రపంచంలో ఎవరికీ భయపడను. ఎలాంటి అన్యాయానికి తలొగ్గను. సత్యానికి ఉన్న శక్తితో అబద్దాలను ఓడిస్తాను. అసత్యానికి వ్యతిరేకంగా పోరాడే సమయంలో ఎదురయ్యే అడ్డంకులన్నింటినీ ఎదుర్కొంటాను. జాతిపిత గాంధీ జయంతి సందర్భంగా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలుపుతూ రాహుల్ ట్వీట్ చేశారు. హత్రాస్ అత్యాచార బాధితురాలి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్లిన రాహుల్, ప్రియాంక గాంధీలను యూపీ పోలీసులు మార్గమధ్యలోనే అడ్డుకున్న విషయం తెలిసిందే. ఈ ఘటనపై గురువారం దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు నిర్వహించారు. ఈ పరిణామాల నేపథ్యంలో అలహాబాద్ హైకోర్టుకు చెందిన లక్నో బెంచ్ హత్రాస్ ఘటనను సుమోటోగా స్వీకరించి విచారణ జరిపేందుకు నిర్ణయించింది.

## హత్రాస్ ఘటనలో నిజాలు దాస్తున్న యోగి

### –సమగ్ర విచారణ జరపాలన్న సుప్రియా సులె

ముంబై,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్ హత్రాస్ ఘటనపై ఆ రాష్ట్ర ప్రభుత్వం ఏదో దాస్తున్నదని ఎన్సీపీ ఎంపీ సుప్రియా సులే అభిప్రాయపడ్డారు. రాహుల్, ప్రియాంక గాంధీ, కాంగ్రెస్ కార్యకర్తలతో పోలీసులు వ్యవహరించిన తీరు, హత్రాస్ డీఎం ఇతర అధికారుల ప్రకటనలు దీనిని రుజువు చేస్తున్నాయని ఆమె అన్నారు. ఉత్తరప్రదేశ్‌లో రెండు రోజుల్లో వరుసగా మూడు అత్యాచార కేసులు తెరపైకి వచ్చాయని, రాష్ట్ర హోంమంత్రి, సీఎం వీటిపై ఏమీ మాట్లాడటం లేదని ఆమె విమర్శించారు. లైంగికదాడుల ఘటనలపై సమగ్ర విచారణ జరుగాలని ప్రధానిని తాను కోరుతున్నానని ఆమె అన్నారు. రాష్ట్రంలో మహిళల భద్రత కోసం యోగి ప్రభుత్వం పనిచేయలేకపోతే, వారు రాజీనామా చేయాలని సుప్రియ సులే డిమాండ్ చేశారు.

## రాష్ట్రంలో ఎప్పుడూ లేని అభివృద్ధి

### –గాంధీ మార్గంలో తెలంగాణలో సంక్షేమ కార్యక్రమాలు: బాల్క

మంచిర్యాల,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరేళ్లలో రాష్ట్రంలో ఎనలేని అభివృద్ధి చేశారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్, ప్రభుత్వ విప్ బాల్క సుమన్ అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పించారు. సిఎం కెసిఆర్ గాంధీ మార్గంలో అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను చేపటట్ఆరని అన్నారు. గత కాంగ్రెస్ పాలనలో తెలంగాణవాసులు అడుగడుగునా అన్యాయానికి గురయ్యారన్నారు. తమ నేత కెసిఆర్ అన్ని రంగాలను సమగ్ర అభివృద్ధి చేసి రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలిపారని చెప్పారు. గతంలో రాష్ట్రంలోని నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ నీటితో అంగవైకల్యం పొంది ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం కింద సురక్షిత నీటిని అందించడం వల్ల ఫ్లోరైడ్ సమస్య తెలంగాణలో ఎక్కడ కూడా లేదని తెలిపారు. శ్రీరాంపూర్ కోల్‌బెల్ట్ ఏరియాలోని సింగరేణి స్థలాల్లో నివాసం ఉంటున్న కార్మిక, కార్మికేతరుల కుటుంబాలకు త్వరలోనే ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తామని స్థానిక ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. ఏళ్ల తరబడి పట్టాల కోసం ఎదురు చేస్తున్న కార్మికుల కళ నెరవేరుతోందని, తాము ఇచ్చిన వాగ్దానం అమలు చేస్తున్నామని చెప్పారు.

సింగరేణి స్థలంలో నివాసం ఉంటున్న వారికి పట్టాలు కల్పించడానికి ప్రభుత్వానికి నామినల్ ఫీజు కింద చెల్లించాల్సిన మొత్తాలకు చెందిన డిమాండ్ నోటీసులు ప్రతి ఇంటికీ అందజేస్తామన్నారు. త్వరలోనే పట్టాలు అందిస్తామన్నారు. ఏరియాలో మొట్టమొదటి సారిగా వాటర్ ట్యాంక్ ఏరియాలో ఇంటింటికీ మిషన్ భగీరథ పథకం ద్వారా 500 కుటుంబాలకు తాగునీరు సౌకర్యం కల్పించామన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో లో ఓల్టేజి విద్యుత్ సమస్య తీరనుందని తెలిపారు.

## గాంధీ కలలుకన్న గ్రామస్వరాజ్యం తెచ్చాం

### గిరిజనులు అభివృద్ధి చెందాలన్నదే ప్రభుత్వ లక్ష్యం
### వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీ
### సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకూ శంకుస్థాపన చేసిన సిఎం జగన్

అమరావతి,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యం తీసుకొచ్చామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. గిరిజనులు అన్ని విధాలా అభివృద్ధి చెందడమే ప్రభుత్వ లక్ష్యమని జగన్ అన్నారు. శుక్రవారం ఆయన తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్వోఎఫ్ఆర్ పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గాంధీ జయంతి రోజున పట్టాల పంపిణీతో పాటు మరిన్ని గిరిజన సంక్షేమ కార్యక్రమాలకు సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. పాడేరులో మెడికల్ కాలేజీ, కురుపాంలో ట్రైబల్ ఇంజనీరింగ్ కాలేజీ, గిరిజన ప్రాంతాల్లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులకు ఆన్‌లైన్ ద్వారా సీఎం జగన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఇంటింటికి ప్రభుత్వ పథకాలు, గ్రామగ్రామానికి ప్రభుత్వ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. గిరిజన సంక్షేమానికి పెద్దపీట వేశామన్నారు.లక్షా 53వేల మంది గిరిజనులకు 3.12లక్షల ఎకరాల భూమి పంపిణీ , రైతు భరోసా సాయం అందిస్తున్నామని తెలిపారు. రూ.500 కోట్లతో పాడేరులో నిర్మించనున్న గిరిజన వైద్యకళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణానికి, విజయనగరం జిల్లా కురుపాంలో 153 కోట్లతో చేపట్టిన గిరిజన ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణానికి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..1.53 లక్షల గిరిజన కుటుంబాలకు 3.12 లక్షల ఎకరాల భూమిపై హక్కులు కల్పిస్తూ పట్టాలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. గాంధీ జయంతి రోజున గిరిజనులకు పట్టాల పంపిణీ ద్వారా నిజమైన గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చినట్టు సీఎం తెలిపారు. వచ్చే నెల రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహించి హక్కుల పత్రాలు పంపిణీ చేస్తామన్నారు. గిరిజనులకు పట్టాల పంపిణీతో పాటు రైతు భరోసా సొమ్ము రూ.13,500 కూడా అందించనున్నట్టు తెలిపారు. వారు తీసుకున్న భూమిని అన్ని విధాలా అభివృద్ధి చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. గిరిజనులకు వైద్యం అందక మరణించిన ఘటనలు గతంలో చాలా జరిగాయని, పరిస్థితులను మార్చాలనే నిర్ణయంతో ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తున్నదని ఆయన అన్నారు. నాడు–నేడుతో ప్రభుత్వ ఆసుపత్రులు, వైద్య కళాశాలలు అభివృద్ధి చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. భూ వివాదాలకు ఎక్కడా తావు లేకుండా డిజిటల్ సర్వే ద్వారా పంపిణీ చేశాం. గిరిజనులకు భూమితో పాటు రైతు భరోసా కింద సాయం అందిస్తాం. పట్టాలు పొందిన గిరిజనులకు ఆదాయం పెరిగేలా చర్యలు తీసుకుంటాం.పంటలు పండించుకునేందుకు గిరిజనులకు ఆర్థిక సాయం అందిస్తామన్నారు. గిరిజనులకు ఫారెస్ట్ అధికారులతో పాటు కలెక్టర్లు దిశానిర్దేశర చేస్తారని సీఎం పేర్కొన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో గిరిజనులకు మంత్రి పదవి ఇవ్వాలన్న ఆలోచన రాలేదని, గిరిజన సలహా మండలి ఏర్పాటు చేయాలన్న ఆలోచన కూడా రాలేదన్నారు. గిరిజనుల ఆదాయం, పచ్చదనం పెరగాలి.గిరిజనుల ఆదాయం, పచ్చదనం పెరగాలి. సీతంపేట, పార్వతీపురం, దోర్నాల, బుట్టాయిగూడెం, రంపచోడవరంలో మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకురాబోతున్నాం. వైఎస్సార్ సంపూర్ణ పోషణ, వైఎస్ఆర్ సంపూర్ణ ప్లస్ పథకం కింద గర్భిణీలకు, చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్నాం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం చదువులను తీసుకొచ్చామని' సీఎం వైఎస్ జగన్ తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాలు, వాలంటీర్ల వ్యవస్థకు ఏడాది పూర్తయిన సందర్భంగా గ్రామ స్వరాజ్యాన్ని సాధ్యం చేస్తున్న వారికి సీఎం వైఎస్ జగన్ అభినందనలు తెలిపారు.

## యాదాద్రిని దర్శించుకున్న ఎపి మంత్రి విశ్వరూప్

యాదాద్రి భువనగిరి,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): యాదాద్రి లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని ఏపీ సాంఘిక సంక్షేమ శాఖల మంత్రి పినిపే విశ్వరూప్ శుక్రవారం సందర్శించారు. కుటుంబ సభ్యులతో కలిసి స్వామిని దర్శించుకున్న ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ఆయనకు స్వాగతం పలికి స్వామివారి ఆశీర్వచనాలతోపాటు తీర్థప్రసాదాలు అందజేశారు. తెలంగాణ ప్రభుత్వం ఆలయాన్ని అద్భుతంగా తీర్చిదిద్దుతోందని ఆయన అన్నారు. ఆలయ నిర్మాణం అద్భుతంగా ఉందన్నారు. మరోమారు ఆలయాన్ని సందర్శిస్తానని అన్నారు.

# కెసిఆర్‌కు ఆలోచనల వెనక గాంధీ ప్రభావం

### రెవెన్యూ చట్టంతో గ్రామాల్లో శాంతియుత వాతావరణం
### పల్లె ప్రణాళికతో గ్రామాల సమగ్ర అభివృద్ధి
### మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వెల్లడి

హైదరాబాద్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): గ్రామాల అభివృద్ధికి సిఎం కెసిఆర్ ప్రతిపాదించిన గ్రామప్రణాళిక నమూనా అంతా గాంధీ స్ఫూర్తితోనే తీసుకున్నదని రాష్ట్ర పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గ్రామాల అభివృద్ధితో పాటు స్వచ్ఛత సాధించడానికి ప్రజలను ఆలంబనగా చేసుకుని ముందుకు సాగుతున్నామని అన్నారు. తాజాగా తీసుకుని వచ్చిన కొత్త రెవెన్యూ చట్టం కూడా గ్రామాల్లో ప్రజల మధ్య హింస లేకుండా ప్రశాంత వాతావరణం తీసుకుని రావాలన్న బలమైన సంకల్పం ఉందని అన్నారు. సిఎం కెసిఆర్‌పై గాంధీ ప్రభావం ఉందని, అందుకే ఆయన చేపట్టే కార్యక్రమాలు సక్సెస్ అవుతున్నాయని అన్నారు. గాంధీ స్ఫూర్తితోనే ఇవాళ తెలంగాణ అభివృద్ధిలో ముందుకు సాగుతోందన్నారు. పల్లెలను అభివృద్ధి నమూనాలు చేయాలన్న సిఎం కెసిఆర్ సంకల్పం వెనక బలమైన కారణం ఉందన్నారు. ప్రజలను అభిశీద్ధిలో భాగస్వామ్యం చేస్తే పనులుకు ధోకా ఉండదని మహాత్ముడిని ఆదర్శంగా తీసుకుని ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యపడుతుందని గ్రహించి దిశానిర్దేశం చేశారని అన్నారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత, రైతుల అభివృద్ధి, గ్రామీణ వృత్తులకు పూర్వ వైభవం తీసుకున రావడం వంటి అనేక కార్యక్రమాలన్నీ గాంధీ స్ఫూర్తితో కెసిఆర్ తీసీఉన్న బలమైన నిర్ణయాలన్నారు. పల్లెల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక వెనక గ్రామాలు అభివృద్ధి చెందాలనే లక్ష్యంతోనే ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు. పల్లె పచ్చని చెట్లతో,స్వచ్ఛంగా కళకళలాడాలంటే అందరి సహకారం అవసరమన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం 500 జనాభా కలిగి ఉన్న ప్రతీ గ్రామానికి రూ.8లక్షల చొప్పున నిధులు మంజూరు చేయుటకు ప్రభుత్వం రూ.350 కోట్లు విడుదల చేయనున్నదని తెలిపారు. సాగునీటికి కొరత రాకుండా చెక్‌డ్యాం నిర్మాణాలు చేపడుతామని అన్నారు. ఆర్థిక సంఘం, ఉపాధి నిధులు ఉపయోగించి గ్రామాలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళుతున్నామని అన్నారు. రాష్ట్రంలోని ఆడబిడ్డలకు సీఎం కేసీఆర్ తోబుట్టువు లాంటివారని, అందుకే ప్రతీ బతుకమ్మ పండుగకు చీరలు అందిస్తున్నారని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. సీఎం కేసీఆర్‌కు మహిళలపై ప్రత్యేక గౌరవం ఉందని, పోరాడి సాధించుకున్న తెలంగాణలో వారు సంతోషంగా ఉండాలని నాలుగేళ్లుగా బతుకమ్మ పండుగకు చీరలు అందజేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ రాష్ట్ర సర్కార్‌కు ఆడపడుచుల దీవెనలు ఎల్లప్పుడూ ఉండాలని కోరాం. రాష్ట్రంలోని మహిళందరూ సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాష్ట్ర ప్రజలంతా ఆత్మభిమానంతో జీవించాలన్నదే సర్కార్ ధ్యేయమన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధిని కేవలం ఐదేళ్ల కాలంలో ముఖ్యమంత్రి కేసీఆర్ చేసి చూపించారన్నారు. రైతుల కోసం ప్రభుత్వం 24 గంటల కరంట్‌ను ఉచితంగా అందిస్తుందన్నారు. పేదింటి ఆడపడుచుల కోసం కల్యాణలక్ష్మి, షాదీముబార్ పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. రైతులకు పంట పెట్టుబడి కోసం ఏడాదిలో రెండు పంటలకు ఎకరానికి రూ. 10 వేల చొప్పున అందిస్తున్న ఘనత ఒక్క టీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. గ్రామంలో శ్రమదానం చేయని వారికి సంక్షేమ పథకాలు అందవన్నారు. ప్రతీ గ్రామానికి ఏటా రూ. 80 లక్షలు అందిస్తున్నామన్నారు. పరిశుభ్రత పాటించకుంటే జరిమానాలు ఉంటాయని స్పష్టం చేశారు. ఊరుకోసం శ్రమదానం చేసే మహిళా సంఘాలకు రూ. 50 వేల నుంచి 3 లక్షల వరకు రుణం ఇప్పించే బాధ్యత తనదేనన్నారు. ప్రతీ గ్రామంలో శ్మశాన వాటిక ఏర్పాటు జరుగుతోందని అన్నారు. ఇవన్నీ కూడా గాంధీ ఆనాడే చెప్పారని, ఇప్పుడు తూచతప్పకుండా పాటిస్తూ గ్రామాలను అభివృద్ధిలో ముందుకు తీసుకుని వెళుతున్న ఘనత సిఎం కెసిఆర్‌దన్నారు. కెసిఆర్ ఓ పద్ధతి ప్రకారం అభివృద్ధి నమూనాలు సిద్ధం చేస్తున్న తీరు ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఆదర్శమని అన్నారు.

# పరుగులు తీస్తున్న ఉల్లి ధరలు

### దానిబాటలోనే కూరగాయల రేట్లు
### కిలో వందకు చేరుతుందంటున్న వ్యాపారులు

హైదరాబాద్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): వరుస వర్షాలతో ఉల్లిగడ్డలు కోయకుండానే కన్నీళ్లు పెట్టిస్తున్నాయి. గతేడాది మాదిరిగానే మళ్లీ ధరలు పరుగులు తీస్తున్నాయి. దీనికితోడు కూరాగాయల ధరలు కూడా పరుగులు తీస్తున్నాయి. ఏ కూరగాయ అయినా కిలో 80 నుంచి వందకు తకకువగా లేదు. దీంతో వంటింట్లో కర్చా విపరీతంగా పెరిగిందని గృహిణులు ఆందోళన చెందుతున్నారు. కరోనాతో ఆదాయ మార్గాలు పడిపోయినా అన్ని వస్తువుల ధరలు మాత్రం విపరీతంగా పెరుగుతున్నాయి.

నాసిరకం ఉల్లి 50రూపాయలకు అమ్ముడవుతుండగా ఓ మోస్తుల ఉల్లి ప్రస్తుతం కిలో 60 రూపాయాలుగా పలుకుతోంది. ఉల్లి ధరలు మరింతగా పెరిగి వందకు చేరుతుందని వ్యాపారులు అంటున్నారు. కొద్ది రోజులుగా వాటి ధరలు అమాంతం పెరుగుతూ వస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్లో కిలో ఉల్లిగడ్డల ధర రూ.50 నుంచి రూ.60 వరకు పలుకుతోంది. దీంతో సామాన్య ప్రజలు విలవిల్లాడుతున్నారు. అటు కొనుక్కోలేక, ఇటు వాడకుండా ఉండలేక సతమతమవుతున్నారు. దీంతో చేసేదిలేక నిత్య వినియోగంలో ఉల్లిగడ్డలను తగ్గించారు. గతంలో కిలో ధర రూ.15 నుంచి రూ.20 ఉన్న ఉల్లిగడ్డల డిమాండ్ పెరుగుతూ వస్తోంది. ఉల్లి ధర పెరుగుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై వినియోగదారులు మండిపడుతున్నారు. ప్రతి యేడాది ఉల్లి ధర అమాంతం పెరుగుతూనే ఉంటుంది. ఆ సమయంలో మార్కెట్ అధికారులు, జిల్లా పౌరసరఫరాల అధికారులు రైతుబజార్‌లో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేస్తుంటారు. గతంలో రేషన్ షాపుల ద్వారా కూడా తక్కువ ధరకు ఒక్కొక్కరికి 2కిలోల చొప్పున అందించారు. అయితే ఈసారి విక్రయ కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. పౌరసరఫరాల శాఖ, మార్కెటింగ్ శాఖాధికారులు స్పందించి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు తక్కువ ధరకు ఉల్లిగడ్డలు అందించాలని వినియోగదారులు కోరుతున్నారు. కర్నాటకతో పాటు మధ్యప్రదేశ్, మహారాష్ట్రలోని పూణె, చంద్రపూర్, బెంగుళూరు, లాసల్‌గావ్ వంటి తదితర ప్రధాన ప్రాంతాల నుంచి తీసుకువచ్చి వ్యాపారులు ఇక్కడ విక్రయాలు జరుపుతుంటారు. నెలరోజుల క్రితం ఉల్లి కిలో ధర రూ.20 ఉండగా ప్రస్తుతం రెండింతలు దాటిపోయింది. రైతుబజార్‌లో, కూరగాయల మార్కెట్‌లో తెల్ల ఉల్లిగడ్డలు రూ.60 నుంచి 80 వరకు నాణ్యతను బట్టి విక్రయిస్తుండగా, ఎరుపు రంగు ఉల్లిగడ్డలు రూ.50నుంచి రూ.60 వరకు అమ్మకాలు జరుపుతున్నారు. దేశ వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఉల్లిగడ్డల సరఫరా తగ్గిపోయి ధరలు మండిపోతు న్నాయని వ్యాపారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో వీటి ధర మరింతగా పెరిగే అవకాశం లేకపోలేదని వ్యాపారులు అభిప్రాయ పడుతున్నారు. ఉల్లికి ప్రధానమైన మార్కెట్లు మహారాష్ట్ర, కర్ణాటక ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా దిగుబడులు పడిపోయాయి. దీంతో ఆ ప్రాంతాల నుంచే ఉల్లిగడ్డలు దిగుమతి తగ్గింది. మహారాష్ట్రలో రెండు నెలలుగా కురుస్తున్న వర్షాలతో పంటలు బాగా దెబ్బతిన్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. మహారాష్ట్రలోని నాసిక్ ఉల్లికి పెట్టిందిపేరు. అక్కడినుంచి దేశంలోని నలుమూలలతో పాటు తెలంగాణ రాష్ట్రానికి ఉల్లిగడ్డలు సరఫరా అవుతాయి. మహారాష్ట్రలోని వర్షాలను సాకుగా చూపి కొంతమంది వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి రెండు నుంచి మూడింతలు ధరను అధికంగా పలుకుతూ వినియోగదారుల నుంచి అడ్డగోలుగా వసూలు చేస్తున్నారనే విమర్శలు లేకపోలేదు. ఉద్యానవన శాఖాధికారులు ఉల్లి సాగు గురించి రైతులకు అవగాహన కల్పించకపోవడం, రాయితీపై విత్తనాలు అందించకపోవడంతోనే రైతులు ముందుకు రావడంలేదని తెలుస్తోంది. గతంలో అనేక జిల్లాలో ఉల్లి సాగు చేసేవారని, ప్రస్తుతం కచేవట్టడం లేదని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. రైతులు వాణిజ్య పంటలతో పాటు కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తే వినియోగదారులకు మేలు జరగడంతో పాటు రైతులు ఆర్థికంగా లబ్దిపొందుతారని అధికారులు అంటున్నారు. అయితే రైతులు మాత్రం సంప్రదాయ పంటలతోనే సరిపెడుతున్నారు. గ్రామాల్లో కూరగాయ పంటలకు ప్రోత్సాహం ఇస్తున్నా రైతులు పెద్దగా ముందుకు రావడం లేదు. దీంతో వాటి ధరలు కూడా అమాంతంగా పెరిగాయి.

# ప్రచారంలో టిఆర్ఎస్ బహుముఖ వ్యూహం

### ఊరూరా ముఖ్య నేతల ప్రచారహోరు
### కాంగ్రెస్, బిజెపిలే లక్ష్యంగా విమర్శల బాణాలు
### కానరాని కాంగ్రెస్ ప్రచారం.. కదలించని బిజెపి ప్రచారం

సిద్దిపేట,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): దుబ్బాక ఉప ఎన్నికల ప్రచారంలో టీఆర్ఎస్ పార్టీ దూసుకుపోతున్నప్పటికీ ఆ స్థాయిలో బిజెపి, కాంగ్రెస్‌ల ప్రచారం కానరావడంలేదు. అభ్యర్థులు ఎవరన్నది ఇంకా తేలలేదు. ఎవరు పోటీ చేస్తారన్న స్పష్టత లేదు. అయినా ఒంటిచేత్తో హరీష్ రావు జిల్లా నాయకులను వెంటేసుకుని ప్రచారంలో గ్రామాలను చుట్టి వస్తున్నారు. బిజెపి నుంచి రఘునందన్ రావు మాత్రమే ప్రచారంలో ఉన్నారు. కాంగ్రెస్ ఇంకా క్షేత్రస్థాయి ప్రచారంలోకి దిగలేదు. దుబ్బాకలో విజయం మాదే అని పిసిసి చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించినా ఆ మేరకు ఎలాంటి ప్రచారార్భాటం కానరావడం లేదు. దుబ్బాక ఉప ఎన్నికల షెడ్యూల్ రావడంతో దుబ్బాక రాజకీయాలు వేడెక్కాయి. ప్రధాన ప్రతిపక్ష పార్టీలు ఉప ఎన్నికల్లో పోటీ చేయడానికి సమాయత్తం అవుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీ తదితర పార్టీల నాయకులు సమాలోచనలు చేసుకుంటున్నారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో ఉన్న కొద్దిపాటి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఇప్పటికే ఆ పార్టీకి రాజీనామాలు చేసి టీఆర్ఎస్‌లో చేరుతున్నారు. ఆ నాయకులను కాపాడుకోవడంతో పాటుగా పార్టీ శ్రేణులను సమన్వయం చేయడానికి కాంగ్రెస్ ఎలాంటి ప్రయత్నం చేయడం లేదు. ఇక అభ్యర్థి విషయంలో ఆ పార్టీలో స్పష్టత లేదు. గత ఎన్నికల్లో ఈ స్థానాన్ని పొత్తులో భాగంగా టీజేఎస్‌కు కాంగ్రెస్ పార్టీ కేటాయించింది. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి పోటీ చేయడానికి నలుగురైదుగురి పేర్లు వినిపిస్తున్నాయి. బీజేపీ ఇప్పటికే నియోజకవర్గంలో ప్రచారాన్ని ప్రారంభించింది. గత ఎన్నికల్లో పోటీచేసిన ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు రఘునందన్‌రావు మరోమారు పోటీ చేయనున్నారు. ఆయనకే టిక్కెట్ రానున్నట్లు ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నారు. కాగా, కొద్ది రోజులుగా ఆయన ఇక్కడ ప్రచారం చేస్తున్నారు. ఎవరికి వారే తమ ప్రచార వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నారు. అందుకు భిన్నంగా టిఆర్ఎస్ పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని వివరిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ప్రచారానికి వెళ్లిన గులాబీ శ్రేణులకు ప్రజలు బోనాలు, మంగళ హారతులతో పాటు వివిధ రూపాల్లో ఘనస్వాగతం పలుకుతున్నారు. ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు దుబ్బాక నియోజకవర్గంలో సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. సీఎం కేసీఆర్ చేపట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలతో పాటు దుబ్బాక నియోజకవర్గంలో చేసిన పనులు, రాబోయే మూడేండ్లలో చేయబోయే పనులు ప్రజలకు విడమరిచి చెబుతున్నారు. ఉదయం నుంచి ప్రారంభమవుతున్న పర్యటనలు రాత్రి వరకు కొనసాగుతున్నాయి. మంత్రి నేతృత్వంలో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో పాటు ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కార్పొరేషన్ చైర్మన్లు, టీఆర్ఎస్ నాయకులు వారికి కేటాయించిన మండల గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. అన్ని మండలాల్లో సమావేశాలు నిర్వహించడంతో పాటు గ్రామాల్లో ముమ్మర ప్రచారం చేస్తున్నారు. విద్యార్థి విభాగం, యువత నాయకులు గ్రామాల్లో సమావేశాలు నిర్వహిస్తూ టీఆర్ఎస్ ప్రచారం చేపడుతున్నారు. ఇక బీజేపీ నాయకులు ఆయా గ్రామాల్లో జెండా ఆవిష్కరణలు చేసుకుంటూ వెళ్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకుల ప్రచారం ఇంకా మొదలు కాలేదు. కాగా, బీజేపీ, కాంగ్రెస్, టీజేఎస్ పార్టీల నుంచి పెద్ద ఎత్తున టీఆర్ఎస్ పార్టీలో చేరిపోతున్నారు. మొత్తంగా దుబ్బాకలో ఉప ఎన్నికల ప్రచారం జోరందుకుంది. మరోవైపు కాంగ్రెస్, బిజెపిల నుంచి చేరికలను

ప్రోత్సహించేందుకు మంత్రి హరీష్ రావు ప్రాధాన్యం ఇస్తున్నారు. అలాగే కేంద్రం తీసుకుని వచ్చిన వ్యవసాయ బిల్లులు, కరెంట్ మీటర్ల బిగింపు వంటి అంశాలను ప్రచారంగా చేసుకుని మంత్రి హరీష్ రావు దూసుకుని పోతున్నారు. కొత్త రెవెన్యూచట్టంతో గ్రామాల్లో ప్రజలకు మేలు కలుగుతుందని అంటున్నారు.

హరీశ్‌రావు పక్కా వ్యూహంతో ప్రచారంలో దూసుకుపోతూ ప్రత్యర్థి పార్టీలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి సుడిగాలి పర్యటనలు చేస్తున్నారు. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులతో పాటు దుబ్బాక నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి పనులను ఇంటింటికీ తీసుకెళ్లేలా కార్యకర్తలను సన్నద్ధం చేశారు. పలు గ్రామాల్లో టీఆర్ఎస్‌కే తమ మద్దతు అంటూ ప్రజలతో ఏకగ్రీవ తీర్మానాలు చేయిస్తున్నారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభో త్సవాలు చేస్తున్నారు. ఆయా గ్రామాల్లో మంత్రికి ప్రజలు ఘన స్వాగతం పలుకుతున్నారు. పైగా సిద్దిపేట, దుబ్బాక రెండు నియోజకవర్గాలు పక్కపక్కనే ఉండడంతో దుబ్బాక నియోజకవర్గంతో మంత్రికి ఆత్మీయ అనుబంధం ఉంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు దుబ్బాక నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. అన్ని మండలాలకు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఇన్‌చార్జిలుగా నియమించడంతో ఆయా మండల కేంద్రాల్లో సమావేశాలు నిర్వహించి గ్రామస్థాయిలో విస్తృత ప్రచారం చేస్తున్నారు. మిరుదొడ్డిలో సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బక్కి వెంకటయ్యలు, దౌల్తాబాద్ మండలంలో ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డ

# వన్యప్రాణుల సంరక్షణే పర్యావరణ పరిరక్షణ

**(అక్టోబర్ 2 - 8, జాతీయ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా)**

మనిషికి ఊపిరితిత్తులు ఎంత ముఖ్యమో భూగోళ పర్యావరణానికి అటవీ సంపద అంతే ప్రధానం. అటవీ సంపదలో దట్టమైన హరిత సంపద మరియు అందులో అంతర్భాగమైన జీవజాతులు లేదా వన్యప్రాణులు వస్తాయి. అడవుల్లో ఉండే జంతు మరియు వృక్షజాలం మానవాళికి వెలకట్టలేని మేలును చేస్తున్నది. మానవ ప్రమేయం లేకుండా స్వతంత్రంగా అడవులలో జీవించే వృక్ష మరియు జంతుజాలాన్ని వన్యప్రాణులుగా పిలుస్తారు. వన్యప్రాణుల్లో భారీ ఏనుగులు, జిరాఫీలు, రైనోలతో మె?దలు పక్షులు, క్రిమికీటకాలు మరియు సూక్ష్మజీవులు వస్తాయి. 1952లో ఏర్పాటు చేసిన భారత "జాతీయ వన్యప్రాణుల మండలి" చొరవతో వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 తీసుకువచ్చి దేశవ్యాప్తంగా వన్యప్రాణి సంరక్షణ కార్యక్రమాలు ఉద్యమంలా సాగుతున్నాయి. దేశవ్యాప్తంగా వన్యప్రాణులను అటవీ సంపదగా కాపాడుకుంటూ, జీవ వైవిధ్యాన్ని పదిలపరుచుకోవాలనే అవగాహన సమాజంలో కల్పించడానికి ప్రభుత్వాలు, పభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంధ కార్యకర్తలు కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైంది. వన్యప్రాణులను ఆహారంగానే కాకుండా జంతు అవయవాలు మరియు కలప అక్రమ వ్యాపారం కోసం చట్టాలను ఉల్లంఘించి వేటాడం/ నరకడం జరుగుతోందనేది కఠిన వాస్తవం. వన్యప్రాణి ప్రాముఖ్యతను ప్రజలకు వివరించే సదుద్దేశంతో ప్రతి ఏటా భారత ప్రభుత్వం అక్టోబర్ 2 నుండి 8 వరకు "జాతీయ వన్యప్రాణి వారోత్సవాల"ను ప్రతిష్టాత్మకంగా చేబడుతున్నది. అడవుల నరికివేతను కట్టడి చేస్తూ, జాతీయ ఉద్యానవనాలు, జీవావరణ నిల్వలు, వన్యప్రాణి అభయారణ్యాలు ఏర్పాటు చేయడం ద్వారా జీవ వైవిధ్యం కాపాడబడి, పర్యావరణ పరిరక్షణకు ఊతం ఇస్తుందన్న అవగాహన కలిగి ఉండాలి. జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు-2020 నినాదంగా "నీటిలో జీవాలు - ప్రజలు మరియు భూగ్రహం కోసం (లైఫ్ బిలో వాటర్ - ఫర్ పీపుల్ అండ్ ప్లానెట్)" తీసుకోబడింది. ఇండియాలో 3.64 శాతం భారత భూభాగంలో 1.2 లక్షల చదరపు కిలోమీటర్ల పరిధిలో 553 అభయారణ్యాలు ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా భూజలచరాల సంరక్షణతోనే పర్యావరణ సమతుల్యత స్థాపించబడుతూ, ఆరోగ్యకర వాతావరణం నెలకొంటుంది.

ప్రపంచవ్యాప్తంగా ప్రతియేటా 5,500 రకాలైన జీవజాతులను పలు స్వార్థ ప్రయోజనాల కోసం అక్రమంగా విక్రయిస్తున్నారని తేలింది. వన్యప్రాణుల పరిరక్షణతోనే జీవ వైవిధ్యం నెలకొంటూ, కాలుష్యం తగ్గించబడి, పర్యావరణ సమతుల్యత సాధ్యపడుతుంది. జాతీయ వన్యప్రాణి వారోత్సవాల్లో భాగంగా అటవీ శాఖ నేతృత్వంలో సదస్సులు, సమావేశాలు, కార్యశాలలు, పలు రకాలైన పోటీలు, గోడ పత్రికల విడుదల, వీధి నాటికలు, జంతు మరియు పక్షుల ప్రదర్శనశాల (జూలు) సందర్శనలు, వన సందర్శనలు, వనమహోత్సవాలు, వన్యప్రాణి పుస్తక పఠనం, వన్యప్రాణుల వీడియోలు చూపించడం, స్వచ్ఛ భారత్, పర్యవరణ వేత్తలతో ముఖాముఖి లాంటి వేదికల ద్వారా ప్రజలకు మరియు విద్యార్థి లోకానికి వన్యప్రాణుల పరిరక్షణ అవసరాన్ని వివరిస్తారు. ఈ వారోత్సవాలలో వన్యప్రాణి పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలు, చట్టాల అమలులో పటిష్టత, అవసరమైన నూతన చట్టాల రూపకల్పన, జీవ సంరక్షణ అవసరం, అభయారణ్యాల ఏర్పాటు, జాతీయ ఉద్యానవనాల స్థాపన, అడవుల నరివేతను వ్యతిరేకించడం వంటి అంశాలలో లోతైన చర్చలు జరపాలి.

ఇండియాలోని అడవుల్లో 91,797 రకాలైన జంతుజాతులు మరియు 46,340 రకాల వృక్షజాతులు ఉన్నది. వీటికి తోడుగా 2,634 రకాల చేపల జలజాతుల సంపద మన దేశంలో ఉన్నది. ప్రపంచంలోని జీవజాతుల్లో 80 శాతం వరకు జీనవైవిధ్యం కలిగిన జంతు సంపద మన దేశంలోనే ఉంది. వీటిలో క్షీరదాలు, పక్షులు, సరిసృపాలు, ఉభయచరాలు లాంటి జీవుల అపారసంపద మన అడవులకు మరియు మానవాళికి ఎనలేని సేవలందిస్తున్నాయి. ఉత్తరాన హిమాలయాల నుండి దక్షిణాన కేరళ అడవుల వరకు అపార జీవ వైవిధ్యంతో అటవీ గొర్రెలు మరియు మేకలు, పులులు, చిరుతలు, అడమి దున్నలు మరియు గేదెలు, అటవీ పిల్లులు, జింకలు, లంగూర్స్, కోతులు, గాడిదలు, ముళ్ళ పందులు, దుప్పులు, కుందేళ్లు, నక్కలు, ముంగీసలు, హైనాలు, గబ్బిలాలు, కుక్కలు, పలు రకాల పాములు, మె?సళ్లు, ఒంటెలు, ఏనుగులు, సింహాలు, తాబేళు, బల్లలు, వైవిధ్యభరిత 2000 రకాల పక్షులు, ఖడ్గమృగాలు, అపార క్రిమికీటకాలు లాంటి అసంఖ్యాక జంతుజాలం మన అడవుల సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తున్నాయి. మన జాతీయ జంతువుగా టైగర్ మరియు జాతీయ పక్షిగా నెమలి గుర్తించబడినవి. మన దేశంలో అనేక అభయారణ్యాలు, జాతీయ ఉద్యానవనాలు, జంతు నిల్వల అడవులు ఉన్నాయి. టైగర్ ప్రాజెక్ట్ పథకంలో భాగంగా 21 టైగర్ రిజర్వులు నిర్వహించబడుతున్నాయి. అతి పెద్ద జీవ వైవిధ్యం కలిగిన 12 దేశాలలో భారత్ ఒకటిగా పేరు తెచ్చుకుంది. మన దేశంలోని ఈస్టర్న్ హిమాలయాలు మరియు వెస్టర్న్ ఘాట్స్ అంతర్భాగంలో ప్రపంచపు 20 శాతం జంతుజాలం ఉంది.

స్వార్థపూరిత మానవుడు వన్యప్రాణుల అక్రమ వ్యాపారం పేరుతో పలు రకాలైన క్షీరదాలు, సరీసృపాలు, పక్షులు మరియు చేపలను వేటాడుతూ, జీవ వైవిధ్యానికి ఎనలేని నష్టాన్ని కలిగిస్తున్నాడు. జీవ సమతుల్యతకు, పర్యావరణ పరిరక్షణకు, ఆహార చక్ర గమనానికి, జీవ వైవిధ్య పరిపుష్టికి, వృక్షరాజ్య విస్తరణకు, పర్యావరణ శుద్ధికి, వన్య జంతువు సంతాన స్థిరాభివృద్ధికి, పలు రకాలైన కాలుష్యాల కట్టడికి, వృక్షజంతుజాలల వైవిధ్యానికి కాపాడటానికి, పర్యాటకరంగ అభివృద్ధికి, క్రీడలు(ఫిషింగ్, వేట) పరిశోధనలు మె?దలగు అంశాలకు వన్యప్రాణుల సంరక్షణ అత్యంత అవసరమని గమనించాలి. వన్యప్రాణుల పరిరక్షణతో పలు అటవీ ఉత్పత్తులైన ఔషధాలు, తేనె, పట్టు, వెంట్రుకలు, ఈకలు, తోలు, చర్మాలు, దంతాలు (చనిపోయిన తరువాత) వంటివి లభిస్తాయి. వన్యప్రాణుల నుండి వంట చెరుకు, కలప, పండ్లు, కాయలు, పువ్వులు, జిగురు లాంటి ఉత్పత్తులు కూడా ప్రత్యేక్షంగా లభిస్తాయి. మన సంస్కృతితో భాగంగా ఏనుగు శిక్ష రస్సుగల గణపతి వెంట ఎలుక, దుర్గమాత వెంట పులి, సరస్వతి వెంట నెమలి, శ్రీరాముని వెంట వానరులు మరియు ధైర్యసాహసాలకు ప్రతీకగా సింహం, శివుని మె?దలో నాగుపాము వంటి జంతువుల సాహచర్యంతో వన్యప్రాణి ప్రాముఖ్యతలను ఆధ్యాత్మిక పారంగా బోధిస్తున్నాయి.

వన్యప్రాణులతో మానవాళికి ప్రాణభయం, వాహనాల ధ్వంసం, సాధుజంతులపై దాడి, పంటచేను విధ్వంసం, క్రిమికీటకాలతో పంట తెగుళ్ళు వంటి నష్టాలు కూడా ఉన్నాయి. అడవుల నరికివేత, పోడు వ్యవసాయం, ప్రకృతి వైపరీత్యాలు (అడవులు కాలిపోవడం, భూకంపాలు, వరదలు, తీవ్ర కరువు లాంటి), పారిశ్రామికీకరణ, డ్యాముల నిర్మాణం, రోడ్లు వేయడం, రైలు మార్గాలు, జలాశయాల రూపకల్పన, అక్రమ సంపాదనకు జంతు వేట, అటవీ సంపద దుర్వినియోగం, పర్యావరణ కాలుష్యం, భూతాపం, ఓజోన్ పొర వలుచబడడం లాంటి కారణాలతో అటవీ జంతుజాలానికి ప్రమాదం పొంచి ఉన్నది. సాధారణ జాతులు, విపత్తులో ఉన్న జాతులు, హానికర స్థితిలో ఉన్న జాతులు, అరుదైన జాతులు, అంతరించి పోయిన జాతులు వంటి పలు రకాలైన వన్యప్రాణులు ప్రమాద హెచ్చరికలు చేస్తున్నాయి. అంతరించి పోయిన వర్గంలో తెలుపు హెరోన్, స్యాండ్‌పైపర్, సైబేరియన్ క్రేన్, తెలుపు వల్చర్, సాఫిష్, రెడ్ టర్టిల్, రాక్ ర్యాట్, పాండిచ్చెరి షార్క్, రీనోసీరోస్, చేపలు తినే మె?సళ్ళు మె?దలగు పలు జీవజాతులు ఉన్నాయి.

వన్యప్రాణి సంరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన జాతీయ ఉద్యానవనాలలో ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పులుల రక్షణ పార్క్, యూపీలోని దుద్వా కోతుల పార్క్, గుజరాత్‌లోని సింహాల ఖిర్ పార్క్, యంపీలోని కన్హా జింకల మరియు శివపురి వోల్వ్ పార్కులు, ఒడిసాలోని సిమిలిపాల్ పులుల పార్క్, సుందర్‌భన్, మానస్ లాంటి అనేక జాతీయ ఉద్యానవనాలు జీన వైవిధ్యాన్ని కాపాడుతున్నాయి. వీటితో పాటు మన దేశంలో వన్యప్రాణి అభయారణ్యాలుగా డచిగమ్(జమ్ము-కాశ్మీర్), రాజాజీ (ఉత్తరాఖండ్),బన్‌బాస (అస్సాం), రాథంబోర్ మరియు సరిస్కా(రాజస్థాన్), కవల్(మహారాష్ట్ర), చండకా(ఒడిసా), పోచారం-ఏటూర్‌నాగారం(తెలంగాణ), బండీపూర్( కర్నాటక), గిండీ మరియు మధుమలై(తమిళనాడు), పెరియర్ (కేరళ) వంటివి పేరొందినవి. భారత్‌లో పులులు, ఏనుగులు, తాబేళ్ళు మరియు మె?సళ్ళను కాపాడేందుకు అటవీ ప్రాజెక్టులు ఉన్నాయి.

అంతరించే ప్రమాదంలో ఉన్న జంతువుల ఆవాసాలను కాపాడడం, అక్రమ వేటను అరికట్టడం, పోడు వ్యవసాయానికి ప్రత్యామ్నాయాలు వెదకడం, జాతీయ ఉద్యానవనాల ఏర్పాటు, అభయారణ్యాల నిర్వహణ, ఫారెస్ట్ రిజర్వుల యజమాయిషీ, అటవీ చట్టాలను కఠినంగా అమలు చేయడం, అక్రమ అడవుల నరికివేతను అడ్డుకోవడం, అడవుల్లో మానవ రవాణ వ్యవస్థలను చేపట్టకపోవడం, విపత్తులో ఉన్న జీవ జాతుల పునరుత్పత్తికి చర్యలు తీసుకోవడం, అడవుల్లో పెద్ద ఎత్తున మె?క్కలు నాటడం లాంటి చర్యలు చేపట్టడం ద్వారా వన్యప్రాణుల సంరక్షణకు బీజాలు పడతాయి. వనానికి అందాన్నిచ్చే దట్టమైన వృక్షాలు మరియు అనేక రకాల జంతు జాతులు సకల మానవాళికి జీవవైవిధ్యం కల్పిస్తూ అపూర్వ సేవలు అందిస్తున్నాయి. జీవవైవిధ్యానికి విఘాతం కలిగితే కరోనా లాంటి విశ్వ మహమ్మారులు విజృంభిస్తాయని మన ఎదుర్కొంటున్న చేదు అనుభవాలు తెలుపుతున్నాయి. భూమిని నివాసయోగ్యం గ్రహంగా కాపాడుకున్నపుడే భవిష్యత్ తరాలు పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యకర వాతావరణంలో నివసించగలుగుతారు. జీవకోటి సమతుల్యత కోసం వన్యప్రాణులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తించాలి.

**- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి**
99497 00037

ఖమ్మం లకారం చెరువు బండ్‌పై వాకర్స్ ప్యారడైజ్‌ను ప్రారంభించిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

# లకారం చెరువు కట్టపై వాకర్స్ ప్యారడైజ్

**-ప్రారంభించిన మంత్రి పువ్వాడ**

ఖమ్మం,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): ఖమ్మంలోని వాకర్ ప్యారడైజ్ ను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రారంభించారు. మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘనంగా నివాళి అర్పించారు. అలాగే మినీ లకారం ట్యాంక్ బండ్ నందు గల వాకర్స్ ప్యారడైజ్ ను ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ఖమ్మం నగరానికి మరో మణిహారంగా నిలిచి నగర ప్రజలకు ఆరోగ్యం, ఆహ్లాదం పంచుతుందని పేర్కొన్నారు. రూ.2 కోట్ల వ్యయంతో పార్క్ ను ఆధునీకరించి వాకింగ్, జాగింగ్, యోగ, ఓపెన్ జిమ్, గ్రీనరి, ఆక్యుపంక్చర్ ఇలా అనేక సదుపాయాలు కల్పించామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాల ద్వారా బల్క్ చెత్తను సేకరించేందుకు కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరిం చారు. అనంతరం ఉత్తమ శానిటరీ వర్కర్స్‌కు ప్రశంసా పత్రాలు, టోపీని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అదనపు కలెక్టర్ స్నేహలత, మున్సిపల్ కమిషనర్ అనురాగ్ జయంతి, మేయర్ పాపాలాల్, సుడా చైర్మన్ విజయ్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు ఉన్నారు.

# రామలింగారెడ్డి ఆశయాలను నెరవేరుస్తాం

**దుబ్బాకకు త్వరలోనే నీరందిస్తాం**

**పుస్తకావిష్కరణ సభలో మంత్రి హరీష్ రావు**

సిద్దిపేట,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): దివంగత మాజీ ఎమ్మెల్యే రామలింగారెడ్డి ఒకే జీవితంలో మూడు అవతారాలు సక్సెస్‌ఫుల్‌గా చూశారని ఆర్థికశాఖ మంత్రి హరీశ్ రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో మంజీర రచయితల సంఘం ఆధ్వర్యంలో సోలిపేట రామలింగారెడ్డి యాదిలో 'స్వప్న సాధకుడు' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడు తూ.. వామపక్ష భావ ఉద్యమాల్లో, తెలంగాణ ఉద్యమంలో, ప్రజాప్రతినిధిగా ఆయన విజయం సాధించారని పేర్కొన్నారు.

ఆయన స్టేజీ వివాహం చేసుకోవడమే కాదు, వారి పిల్లలకు సైతం స్టేజీ వివాహాలు జరిపించి ఆదర్శంగా నిలిచారన్నారు. అధికారంలో ఉన్నా సమస్యలుంటే ప్రతిపక్ష పాత్ర పోషించేవారన్నారు. రాష్ట్రమంతా నీళ్లు పొంగిపొర్లుతున్నా ఇంకా సింగూరు నిండలేదు. కాళేశ్వరం ద్వారా గోదావరి ధారను మంజీరాతో కలిపి దాన్ని జీవధారగా మార్చే బృహత్తర ప్రయత్నం సీఎం కేసీఆర్ చేస్తున్నారని మంత్రి తెలిపారు. గతేడాది 27 లక్షల వరి సాగు జరిగితే ఈ సారి 54 లక్షల ఎకరాల్లో వరి సాగు జరుగుతున్నదని వివరాలను వెల్లడించారు.

ఇది దేశంలోనే ఒక రికార్డు. ఇదంతా మిషన్ కాకతీయ, కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు విజయవంతంగా నిర్మించుకోవడం వల్లనే సాధ్యమైందని గుర్తు చేశారు. దుబ్బాకకు రామలింగారెడ్డి తాగు నీరందించారు. సాగు నీరందించే చివరి దశలో ఆయన మనమధ్య లేక పోవడం బాధాకరమన్నారు. మరికొద్ది రోజుల్లో ఇంటింటికి తాగు నీరు, ప్రతి ఎకరాకు సాగు నిరందించాలనే లింగన్న స్వప్నాన్ని త్వరలోనే నిజం చేస్తామన్నారు. కార్యక్రమంలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, నందిని సిధారెడ్డి, సీనియర్ జర్నలిస్టు కె రామచంద్రమూర్తి, మరసం జిల్లా అధ్యక్షుడు రంగాచారి తదితరులు పాల్గొన్నారు.

# మజీద్ కాంప్లెక్స్ నిర్మాణానికి రూ. 5 లక్షలు అందజేసిన మంత్రి

ఖమ్మం,అక్టోబర్ 2 : ఖమ్మం నగరాభివృద్ధిలో భాగంగా ముస్తఫా నగర్- బోనకల్ రోడ్డు విస్తరణలో మజీద్ -ఏ-ముస్తఫా నగర్ పూర్వ షాపింగ్ కాంప్లెక్స్ తొలగించేందుకు అంగీకరించిన మజీద్ కమిటీకి రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ రూ.5 లక్షలు అందజేశారు. నాడు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో పువ్వాడని ఆయా కమిటీ ప్రతినిధులు కలిసి తమ గోడును విన్నవించారు. మళ్లీ కాంప్లెక్స్ నిర్మాణంకు తన వంతుగా పూర్తి సహకారం అందిస్తానని ఇచ్చిన హామీ మేరకు.. మిగిలిన స్థలంలో ఆయా షాపింగ్ కాంప్లెక్స్ ను తిరిగి నిర్మించేందుకు సొంత డబ్బులను అందజేశారు.

అనంతరం నమాజ్ లో పాల్గొన్నారు. ఇచ్చిన మాట ప్రకారం కాంప్లెక్స్ నిర్మాణకు సహకరించిన మంత్రి పువ్వాడ కు మజీద్ కమిటీ ప్రతినిధులు అబ్దుల్ రెహమాన్, సయ్యద్ సర్వేర్, మహ్మద్ ఇబ్రహీం, మొహ్మద్ ఖాజా, సయ్యద్ యాకుబ్ బాబా, షేక్ మహమూద్ , మక్బూల్, ఇస్సాక్ ధన్యవాదాలు తెలిపి శాలువతో సత్కరిం చారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మందడపు మనోహర్, సుడా చైర్మన్ విజయ్ ఉన్నారు.

# కంబోడియాలో భారత రాయబారిగా దేవయాని

**ఉత్తర్వులు ఇచ్చిన కేంద్ర విదేశాంగ శాఖ**

న్యూఢిల్లీ,అక్టోబనిన2(ఆర్ఎన్ఎ): కంబోడియాలో భారత రాయబారిగా దేవయాని ఉత్తం ఖోబ్రగడే నియమితులయ్యారు. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖ గురువారం ఆమె నియామకాన్ని ధ్రువీకరించింది. 1999 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) కు చెందిన దేవయాని.. ప్రస్తుతం ఢిల్లీలోని విదేశాంగా మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యాలయంలో సంయుక్త కార్యదర్శి హోదాలో పనిచేస్తున్నారు.

దాదాపు 21 సంవత్సరాల కెరీర్‌లో దేవయాని.. బెర్లిన్, ఇస్లామాబాద్, రోమ్, న్యూయార్క్‌లోని భారతీయ మిషన్లలో పనిచేశారు.

తన ఇంట్లోని భారతీయ పనిమనిషికి అండర్ పేయింగ్ ఆరోపణలపై న్యూయార్క్‌లోని అధికారులు దేవయాని ఖోబ్రగడేపై చర్య తీసుకోవడంతో 2013 లో ఆమె వార్తల్లోకెక్కారు. ఆ తర్వాత ఆమె న్యూయార్క్‌లోని ఇండియన్ డిప్యూటీ కాన్సుల్ జనరల్‌గా పనిచేశారు. విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రధాన కార్యాలయంలో ఖోబ్రగడే.. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్, సెంట్రల్ యూరప్, ÷నాన్స్, సీపీవీ (కాన్సులర్ పాస్‌పోర్ట్, వీసా) విభాగాలతో సహా అనేక విభాగాల్లో పనిచేశారు.

# నీళ్ల విషయంలో రాజీపడేది లేదు

**వివరాలతో సన్నద్ధంగా ఉండాలి**

**ఆరున అపెక్స్ కౌన్సిల్ సన్నద్ధతపై సుదీర్ఘ చర్చ**

**అధికారులతో సమీక్షలో సిఎం కెసిఆర్**

హైదరాబాద్,అక్టోబర్2(ఆర్ఎన్ఎ): తెలంగాణ వ్యవసాయాన్ని, రైతన్నను కాపాడుకునే విషయంలో దేవునితోనైనా కొట్లాటకు సిద్ధమని సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమమే నీళ్లతో ముడిపడి సాగిందని గుర్తుచేశారు. వ్యవసాయరంగంలో పండుగ వాతావరణం నెలకొందని, పంటల దిగుబడిలో తెలంగాణ రైతు దేశానికే ఆదర్శమని తెలిపారు. తెలంగాణ దేశానికే ధాన్యాగారంగా మారిందని పేర్కొన్నారు. సాగునీటి రంగాన్ని బలోపేతం చేస్తూ నదీజలాలను ఒడిసిపట్టుకొని.. తెలంగాణ బీళ్లను సస్యశ్యామలం చేస్తున్నామని కేసీఆర్ తెలిపారు. తెలంగాణకు గోదావరి, కృష్ణా నదీ జలాల్లో హక్కుగా వచ్చే.. ప్రతి నీటి బొట్టును కూడా వినియోగించుకొని తీరుతామని స్పష్టం చేశారు. అపెక్స్ కౌన్సిల్‌లో బలమైన వాదనలు వినిపించాలని అధికారులకు కేసీఆర్ ఆదేశించారు. ప్రగతిభవన్‌లో సమీక్ష సందర్భంగా సిఎం కెసిఆర్ అపెక్స్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడాల్సిన అంశాలను సుదీర్ఘంగా చర్చించారు. దీనికి నీటిపారుదశాక అధికారులు హాజరయ్యారు. నదీజలాల విషయంలో ఏపీ కావాలనే కయ్యం పెట్టుకుంటోంద ని, అపెక్స్ సమావేశంలో ఏపీ వాదనలకు ధీటైన సమాధానం చెబుతామని సీఎం కేసీఆర్ హెచ్చరించారు. మళ్లీ తెలంగాణ జోలికి రాకుండా వాస్తవాలను కుండబద్దలు కొట్టినట్టు స్పష్టంచేసే విధంగా సమాచారం సిద్ధం చేయాలని అధికారులకు కేసీఆర్ ఆదేశించారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులతో కేసీఆర్ గురువారం ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఎపి పెడుఉతన్న కొర్రీలు, మన వాటా జలాలు తదితర అంవాలను చర్చించారు. నదీజలాల విషయంలో తెలంగాణ హక్కులను సంపూర్తిగా చర్చించారు. ఈ నెల 6న అపెక్స్ కమిటీకి హాజరుకానున్న నేపథ్యంలో సమీక్ష నిర్వహించారు. సమగ్ర వివరాలతో రావాలని అధికారులకు సీఎం ఆదేశించారు. గతంలో రెండుసార్లు వాయిదా పడిన అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని అక్టోబరు 6న నిర్వహించాలని నిర్ణయించారు. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కేసీఆర్, జగన్ మోహన్‌రెడ్డి పాల్గొననున్నారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగే ఈ సమావేశంలో రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదంపై చర్చించనున్నారు. ఏపీ ప్రభుత్వం చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టుతోపాటు ఏపీ ఫిర్యాదు చేసిన తెలంగాణ ప్రాజెక్టులు, బోర్డుల అధికారాలు వంటి వాటిపై చర్చించే అవకాశం ఉంది. అపెక్స్ కౌన్సిల్ సమావేశాన్ని ఆగస్టు 5న నిర్వహించాలని కేంద్రం తొలుత నిర్ణయించింది. ఈ సమావేశంలో పాల్గొనలేమని తెలంగాణ ప్రభుత్వం స్పష్టం చేయడంతో దాన్ని వాయిదా వేశారు. అనంతరం ఆగస్టు 25న నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశానికి ముందు కేంద్ర మంత్రికి కరోనా సోకడంతో కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేశారు. అయితే ఈ నెల 6న సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై ఇప్పటికే ఇరు రాష్ట్రాలకు కేంద్రం సమాచారం ఇచ్చింది.

దీనికి సంబంధించి అనుసరించాల్సిన వ్యూహాన్ని గురువారం ప్రగతి భవన్‌లో జలవనరుల శాఖ ఉన్నతాధికారులతో జరిపిన ఉన్నతస్థాయి సమావేవంలో సీఎం కేసీఆర్ ఖరారు చేశారు. ఈ సమావేశంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, ఎమ్మెల్యేలు అబ్రహాం, సురేందర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సీఎంఓ అధికారులునర్సింగరావు, భూపాల్‌రెడ్డి, నీటిపారుదలశాఖ సలహాదారు ఎస్‌కే జోషి, ప్రిన్సిపల్ సెక్రటరీ రజత్‌కుమార్, ఈఎన్సీలు మురళీధర్‌రావు, నాగేందర్‌రావు, హరిరాం, సీఈవోలు నర్సింహ, శంకర్, రమేశ్, ఓఎస్డీ శ్రీధర్ దేశ్‌పాండే తదితరులు పాల్గొన్నారు.

# గాంధీజీ సేవలు మరువలేనివి -జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే

వేములవాడ, అక్టోబర్ 2 (నేటినిజం ప్రతినిధి):ప్రతినిధి స్వాతంత్ర కోసం గాంధీజీ సేవలు మరువలేనివి ,దేశ అభివృద్ధి కోసం నిస్వార్థంగా మనమందరం సేవలు అందించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే అన్నారు .శుక్రవారం జిల్లా కార్యాలయంలో మహాత్మా గాంధీ 151వజయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు . అనంతరం సిరిసిల్ల పట్టణంలోని గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు .ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ గాంధీజీ సూచించిన శాంతి, అహింస, సత్యం మార్గంలో ముందుకు సాగాలని గాంధీ సన్మార్గంలో ప్రయాణిస్తూ సమ్మిన సిద్ధాంతాలను విలువలను నిబద్ధతతో ఆచరించడం వల్ల ఆయన కీర్తి ప్రతిష్టలు విశ్వవ్యాప్తం అయ్యాయని అన్నారు. ఈ కుమార్ సి.ఐ వెంకటనర్సయ్య పోలీస్ కార్యక్రమంలో ఆర్.ఐ అడ్మిన్ సంపత్ సిబ్బంది పాల్గొన్నారు...

# వేములవాడలో కొవ్వొత్తుల ర్యాలీ

వేములవాడ, అక్టోబర్ 2 (నేటినిజం ప్రతినిధి ):వేములవాడ పట్టణంలో వేములవాడ యూత్ ఆధ్వర్యంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని హాథ్రస్ జిల్లాలో హత్యాచారనికి గురై చనిపోయిన మనీషా వాల్మీకికి న్యాయం జరగాలని , ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి అనంతరం పట్టణంలోని మల్లారం చౌరస్తా వద్ద ఆమె చిత్రపటానికి నివాళులు అర్పించారు . యూత్ నాయకులు మాట్లాడుతూ అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించేలా చేయాలని , మనీషా కుటుంబానికి న్యాయం జరగాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎండి అక్రమ్ , న్యా త నరేష్ , అనిరుద్ ,వెంకటేష్ ,రాజు తదితరులు పాల్గొన్నారు

# జాతిపితకు ఘన నివాళులు

**-మహాత్ముని ఆశయాలను కొనసాగిద్దాం**

**టి.ఆర్.కె ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్‌కుమార్**

**-టి.ఆర్.కె ట్రస్ట్ ఆధ్వర్యంలో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు**

వేములవాడ, అక్టోబర్ 2 (నేటినిజం ప్రతినిధి)మహాత్ముని ఆశయాలు కొనసాగిద్దామని టి ఆర్ కె ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ అన్నారు. శుక్రవారం మహాత్మా గాంధీజీ 151వ, లాల్ బహదూర్ శాస్త్రి 116వ జయంతి వేడుకలను టి ఆర్ కె ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేములవాడ పట్టణంలోని గాంధీనగర్ లో గాంధీ విగ్రహానికి ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అనంతరం శాస్త్రి నగర్ లో లాల్ బహదూర్ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకులు తోట రామ్ కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల జయంతి వేడుకలను ఒకే రోజు జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. బాపూజి సత్యం,అహింసతో ఆంగ్లేయులను తరిమి కొడితే, భారత దేశ రెండవ ప్రధాన మంత్రిగా లాల్ బహదూర్ శాస్త్రి దేశానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టి ఆర్ కె ట్రస్ట్ డైరెక్టర్ మహేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి నాయిని శేఖర్, టి ఆర్ కె ట్రస్ట్ వర్కింగ్ టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

# పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మహబూబాబాద్,అక్టోబర్2: భూమిని సాగు చేసుకుంటున్న అర్హులైన ప్రతి రైతు ఇంటికే పట్టాదారు పుస్తకాలు అందజేస్తామని మహబూబాబాద్ ఎమ్మె